

పల్నాడుకు కొత్త బాస్‌లు

- కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ
- ఎస్పీగా మాలికా గార్గ్



నరసరావుపేట, మే 18: పల్నాడు జిల్లాకు కలెక్టర్‌గా లత్కర్ శ్రీకేష్ బాలాజీ, ఎస్పీగా మాలికా గార్గ్ నియమితులయ్యారు. జిల్లాలో పోలింగ్ రోజు, ఆ తర్వాత చెలరేగిన హింసపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. జిల్లాలో కీలక అధికారులపై కొరడా ఝుళిపించింది. కలెక్టర్ శివ శంకర్ లోతేటిని బదిలీ చేసింది. ఎస్పీ బిందు మాధవ్‌తో పాటు జిల్లాలో ఆరుగురు పోలీసు అధికారులను సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే. సదరు అధికారులపై శాఖపరమైన చర్యలకు ఈసీ ఆదేశించింది.

మాలికా గార్గ్ గతంలో కృష్ణా జిల్లా అడిషనల్ ఎస్పీగా పనిచేశారు. ఆ తర్వాత ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పనిచేశారు. అనంతరం తిరుపతి ఎస్పీగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. మాలికా గార్గ్ పశ్చిమ బెంగాల్‌కు చెందిన పోలీస్ అధికారిని. ఆమె భర్త వకుల్ జిందాల్ బాపట్ల జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు.

లత్కర్ శ్రీకేష్ బాలాజీ 2011 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన అధికారి. గతంలో ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్ సంస్థకు, అగ్రికల్చర్ కో-ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ ఉపాధ్యక్షులుగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం లత్కర్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై కలెక్టర్‌గా రానున్నారు.



గ్రహణం వీడేనా?

రాష్ట్రంలో అతిపెద్ద పారిశ్రామిక జిల్లాల్లో ఒకటిగా ఉన్న గుంటూరు జిల్లాలో పారిశ్రామిక రంగానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. గడిచిన ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరి కారణంగా జిల్లాలో కొత్తగా పరిశ్రమలు వచ్చే పరిస్థితే లేకుండా పోయింది. పరిశ్రమాధిపతులపై అధికార వైసీపీ నేతల బెదిరింపులు, వేధింపులు, రాష్ట్ర ప్రభుత్వ కక్షసాధింపు చర్యల కారణంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎవరూ జిల్లాలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రాలేదు. అధికార పార్టీకి కప్పం కట్టలేక చాలా మంది తమ ప్రయత్నాలను మానుకున్నారు. లేదంటే పక్క రాష్ట్రాల్లో పెట్టుబడులు పెట్టడానికి సిద్ధమయ్యారు. ఫలితంగా గడిచిన ఐదేళ్లలో జిల్లాలో చెప్పుకోదగిన పరిశ్రమ ఒక్కటీ రాలేదంటే ఆశ్చర్య పోవాల్సిన పనిలేదు.

- గడిచిన ఐదేళ్లలో జిల్లా పారిశ్రామిక రంగం కుదేలు
- జిల్లాలో మచ్చుకైనా కానరాని పారిశ్రామిక ప్రగతి
- భారీ, మధ్య తరహా పరిశ్రమల స్థాపన శూన్యం
- ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపనలోనూ అదే దుస్థితి
- ప్రభుత్వ వైఖరితో పక్క రాష్ట్రాల వైపే అందరి చూపు
- రానున్న రోజుల్లోనైనా పరిస్థితి మారేనా?



గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): జిల్లాల విభజన ఉమ్మడి జిల్లాకు పారిశ్రామికరంగంలో శాపంగా పరిణమించింది. విభజిత గుంటూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి ఏమాత్రం అవకాశం లేకుండాపోయింది. కాగా సున్నపురాయి, నాపరాయి వంటి వనరులు, అటవీ సంపదను కలిగి వుండి, ఉమ్మడి జిల్లాలోని మొత్తం పరిశ్రమల్లో రెండింట మూడొంతుల పరిశ్రమలను పొందిన పల్నాడు జిల్లా పరిస్థితి కూడా అలానే వుండడం విషాదం. సముద్రతీరం, ఆక్వారంగం విస్తారంగా వున్న బాపట్ల జిల్లా పరిస్థితి కూడా ఇంచుమించు అలానే వుంది. 2022 ఏప్రిల్‌లో జరిగిన జిల్లాల పునర్విభజనకు ముందు ఉమ్మడి గుంటూరు జిల్లాలో సుమారు 16,020 పరిశ్రమలు ఉన్నాయి. వీటిలో రూ.250 కోట్లు అంతకు మించి పెట్టుబడులున్న భారీ పరిశ్రమలు 81 ఉండగా, కోటి నుంచి 50 కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి (ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలు 15,938 ఉన్నాయి. విభజనలో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 81 భారీ పరిశ్రమల్లో 53 పరిశ్రమలు పల్నాడు జిల్లాకే దక్కాయి. చెట్టినాడు, కేసీపీ, పరాశక్తి వంటి భారీ సిమెంటు పరిశ్ర మలు, పిడుగురాళ్ల కేంద్రంగా ఉన్న సున్నపు బట్టీల పరిశ్రమ, చిలకలూరి పేట స్పిన్నింగ్, టెక్స్‌టైల్స్ హబ్‌లు అన్నీ పల్నాడు పరమయ్యాయి. బాపట్ల జిల్లాకు 2 భారీ పరిశ్రమలు పోగా మిగిలిన 26 పరిశ్రమలతో గుంటూరు జిల్లా సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. కాగా ఉమ్మడి జిల్లాలో ఉన్న 15,938 ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల్లో దాదాపు 8 వేల ఎంఎస్‌ఎంఈలు పల్నాడుకే దక్కాయి. మిగిలిన వాటిలో సుమారు 1500 ఎంఎస్‌ఎంఈలు బాపట్ల జిల్లాకు పోగా గుంటూరు జిల్లాకు 6,425 పరిశ్రమలు మాత్రమే మిగిలాయి. అయితే భారీగా పరి శ్రమలు వున్న పల్నాడు పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందుతుందని భావించినా, గడిచిన రెండేళ్లలో అలాంటి పరి స్థితి ఏమాత్రం కనిపించలేదు. రాజధాని జిల్లాగా వున్న గుం టూరులో రోడ్డు, రైలుమార్గాలు విస్తారంగా వున్నా పరిశ్రమల స్థాపన జరగలేదు. అందుకు కారణం ప్రభుత్వ కక్ష సాధింపు వైఖరే అని తెలుస్తోంది.

సూక్ష్మ పరిశ్రమలదీ అదే దుస్థితి


సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి(ఎంఎస్‌ఎంఈ) పరిశ్రమలకు జిల్లాలో తగిన స్థానం దక్కలేదు. కిందటేడాది రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల స్థాపనకు భారీ లక్ష్యాలను నిర్ణయించుకుని నానా హడావుడి చేసినా పరిశ్రమల స్థాపన జరగలేదు. రూ.లక్ష నుంచి 5 లక్షల లోపు పెట్టుబడులతో ఒకరు లేక ఇద్దరికి ఉపాధి కల్పించే అతి చిన్న పరిశ్రమలు స్థాపించడానికి కూడా సాహసించలేని పరిస్థితి ఉండడంతో లక్ష్యాల్లో మూడోవంతు పరిశ్రమలు కూడా స్థాపించలేకపోయారు. గుంటూరు జిల్లాలో రూ.750 కోట్లతో 6,000 ఎంఎస్‌ఎంఈలు స్థాపించి 7,500 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా 365.4 కోట్ల పెట్టుబడులతో 2,197 ఎంఎస్‌ఎంఈలను స్థాపించారు. బాపట్ల జిల్లాలో రూ.500 కోట్లతో 4,000 ఎంఎస్‌ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.239 కోట్లతో 1,516 ఎంఎస్‌ఎంఈలను స్థాపించారు. పల్నాడు జిల్లాలో రూ.625 కోట్ల పెట్టుబడితో 5000 ఎంఎస్‌ఎంఈలను స్థాపించాలనుకోగా రూ.16.6 కోట్లతో కేవలం 410 ఎంఎస్‌ఎంఈలు మాత్రమే స్థాపించారు.

ఐదేళ్ల గ్రహణం వీడేనా?

గడిచిన ఐదేళ్లలో పరిశ్రమల స్థాపన, ఉపాధి కల్పన అనేది జిల్లాలోని యువతకు కలగానే మిగిలిపోయింది. ఖనిజ, సహజ వనరుల ఖిల్లాగా ఉన్నా, రోడ్లు, రైల్వే వంటి మౌలిక సదుపాయాల కల్పన విస్తారంగా వున్నా జిల్లాలో పారిశ్రామిక ప్రగతి కుంటుబడిపోయింది. ఈ కారణంగా జిల్లాలోని యువతకు పని దొరకడమే కష్టంగా మారిపోయింది. తాజాగా అసెంబ్లీ ఎన్నికలు జరిగిన నేపథ్యంలో ఇకనైనా తమ రాతలు మారాలని వారు బలంగా కోరుకుంటున్నారు. ఇదే ప్రభుత్వం మళ్లీ వస్తే తమ బతుకుదెరువు, భవిష్యత్తు రెండూ కనుచూపు మేరలో కనిపించవన్న భయం వారిని వెంటాడుతోంది. ఈ క్రమంలోనే వారంతా ప్రభుత్వం మారాలని, తద్వారానే తమ తలరాతలు మారతాయని బలంగా నమ్ముతున్నారు.


రెండేళ్లలో వచ్చిన పరిశ్రమలు, ఉద్యోగాలు శూన్యం

గత చంద్రబాబు ప్రభుత్వంలో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ఎంతో ఆసక్తి చూపారు. కానీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక వారంతా కనుమరుగైపోయారు. ప్రభుత్వ గణాంకాలే ఈ విషయాన్ని నిర్ధారిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వే ప్రకారం 2014 నుంచి 2021 వరకూ జిల్లాలో మెగా, భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా, ఆ తరువాత ఒక్క పరిశ్రమ కూడా స్థాపించలేదు. 2014- 21 మధ్య కాలంలో గుంటూరు జిల్లాలో 7, బాపట్ల జిల్లాలో 4, పల్నాడు జిల్లాలో అత్యధికంగా 9, మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 20 మెగా భారీ పరిశ్రమల స్థాపన జరగ్గా 2,485.47 కోట్ల రూపాయల పెట్టుబడులు, 4,500 మందికి ఉద్యోగాలు వచ్చాయి. కాగా 2021- 22, 2022- 23 మధ్య ఈ మూడు జిల్లాల్లో ఒక్క భారీ పరిశ్రమగాని, ఒక్క రూపాయి పెట్టుబడిగానీ, ఒక్కరికి ఉద్యోగం కానీ రాలేదని సాక్ష్యాత్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆర్థిక సర్వేనే చెబుతోంది.



ఫుల్‌గా.. తాగేశారు..

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో దిమ్మ తిరిగేలా మద్యం అమ్మకాలు
- 56 రోజుల్లో 235.31 కోట్ల లిక్కర్ అమ్మకాలు
- కోట్ల విలువ చేసే నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కుమ్మరించారు...



గుంటూరు, మే 18(ఆంధ్రజ్యోతి): గతంలో ఏ ఎన్నికల్లో లేని రీతిలో ఈ పర్యాయం మద్యం ఏరులై పారింది. నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచే ఓటర్లను మత్తులో ముంచే ప్రయత్నం చేశారు. తమ పాలనతో ప్రజలు అన్ని రకాలుగా విసుగు చెందారని ముందుగానే గుర్తించిన వైసీపీ అభ్యర్థులు ఓటర్లకు అవేవీ గుర్తుండకుండా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మత్తు దిగగానే వారు తమ ప్రతాపం చూపించారు. ఈ ఐదేళ్లలో మద్యం వ్యాపారాన్ని సైతం ప్రభుత్వం పేరుతో వైసీపీ పాలకులు తమ హస్తగతం చేసుకున్న విషయం తెలి సిందే. దీంతో మద్యం దుకా ణాల మధ్య పోటీ లేకపోవటం తో పాలకుల ఇష్టారాజ్యం అయి పోయింది. జె బ్రాండ్‌గా ప్రజలు పిలు చుకునే నాసిరకం మద్యంను మాత్రమే షాపుల్లో ఉంచి అమ్మించారు. వాటికి కూడా అధిక ధరలు పెట్టి పేదలను దోచుకున్నారు. కేవలం నగదుతోనే అమ్మకాలు జరిపించి లాభాల లెక్కలను గోల్‌మాల్ చేసి ఎన్నికల ఫండ్‌కు వాటిని మరలించినట్లు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా పేదల నుంచి దోచుకున్న సొమ్ముతోనే తిరిగి మద్యం రూపంలో వారికే ఇచ్చి ఎన్నికల్లో లబ్ధి పొందాలని వైసీపీ అధిష్టానం పన్నిన కుయుక్తులు పారలేదు. ఎన్నికలకు రెండు, మూడు నెలలు ముందు కూడా నాసిరకం మద్యం సీసాలతోనే షాపులను నింపిన వైసీపీ ప్రభుత్వం హఠాత్తుగా ఓటర్లపై ప్రేమ చూపుతూ మంచిరకం మద్యం కూడా వైన్‌షాపుల్లో ఉండేలా చూశారు. దీనికి కూడా ప్రధాన కారణం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తన ఎన్నికల ప్రచార సభల్లో జె బ్రాండ్ పేరుతో పేదలను దోచుకోవటమే కాకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని, సీఎం జగన్‌పై ఆగ్రహం వెలిబుచ్చుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంచి మద్యాన్ని మాత్రమే అమ్మిస్తామనే చెప్పటంతో ఎన్నికల సమయంలో ఓటర్లను మభ్య పెట్టేందుకు కొద్దిరోజుల పాటు మురిపించారు. కాగా ఎన్నికల జాతర ప్రారంభమై ముగిసిన 56 రోజుల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో రూ.235.31 కోట్ల మద్యం అమ్మకాలు జరిగినట్లు అధికారులు రికార్డుల్లో చూపారు. వాస్తవానికి ఇందులో 10 శాతం కూడా ప్రజలు నేరుగా కొనుక్కొని తాగింది ఉండదు. మిగతా అంతా కూడా ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ముఖ్యంగా వైసీపీ క్యాండెట్స్ కొనుగోలు చేసి పంపిణీ చేసేందేనని చెప్పుకోవచ్చు. గత్యంతరం లేక టీడీపీ అభ్యర్థులు కూడా తాము మద్యం పంపిణీ చేసేందుకు కొనుగోలు చేయాలని ప్రయత్నించినప్పటికీ సింహబాగం తమ పార్టీ అభ్యర్థులకే దక్కేలా వైసీపీ పెద్దలు అధికార దర్పంతో చేశారు. దీంతో ప్రతిపక్షంలో ఉన్న కూటమి అభ్యర్థులు తమకు అనుకూలంగా ఉండే బార్ యజమానుల నుంచి అధిక ధరలు చెల్లించి మద్యం కొనుగోలు చేయాల్సి వచ్చింది. నోటిఫికేషన్ వెలువడిన మార్చి 16 నుంచి ఈనెల 11వ తేదీ వరకు (పోలింగ్ తేదీకి రెండు రోజులు ముందు షాపులు మూసివేశారు) 2,60,200 కేసులు లిక్కర్ అమ్మకాలు జరిగాయి. అంటే బ్రాందీ, విస్కీ వంటి మద్యం, బీరు అమ్మకాలు 76,100 కేసులు అమ్మారు. ఇదంతా అధికారుల లెక్కల్లోఉండే మద్యం అమ్మకాల చలామణీ మాత్రమే ఇక ఏపీలో కంటే పొరుగురాష్ట్రాల్లో మద్యం చౌకగా లభిస్తుండటంతో పోటీలో ఉన్న అభ్యర్థులు ఆ రాష్ట్రాల నుంచి లారీల్లో తమ తమ నియోజకవర్గాలకు తరలింప చేసుకొని గడ్డివాముల్లో నిల్వ చేసి విడతల వారీగా ఎన్ని కల ప్రక్రియ ముగిసే వరకు పంపిణీ చేశారు. దీని విలువ అంచనాకు అందనప్పటికీ కోట్లల్లోనే ఉంటుందని చెప్పవచ్చు. విశేషమేమిటంటే ప్రభుత్వం ఎన్నికల నియమావళి ప్రకారం 11వ తేదీనే దుకాణాలను మూయించి సీల్ వేసినప్పటికీ అప్పటికే తమ తమ స్థావరాల్లో రహస్యంగా ఉంచిన మద్యాన్ని సాధారణ రోజుల్లో కంటే ఎక్కువగా పారేలా చేశారు.

దాడులు జరుగుతుంటే.. ఏం చేస్తున్నారు

పోలీసులపై సిట్ బృందం ప్రశ్నల వర్షం ● పోలింగ్ అరాచకాలపై విచారణ ప్రారంభం ● నరసరావుపేట, రెంటచింతల పోలీస్‌స్టేషన్లలో విచారణ

నరసరావుపేట, రెంటచింతల, మే 18: దాడులు జరుగుతుంటే ఏం చేస్తున్నారు.. ఘటనలపై ముందస్తు సమాచారం ఉంది కదా.. ముందస్తు ఏం చర్యలు తీసుకున్నారు.. విధ్వంసం సృష్టిస్తున్న వారిని ఎందుకు అడ్డు కోలేకపోయారు.. అంటూ సిట్ బృందం పోలీసు అధికారులపై ప్రశ్నల వర్షం కురిపించింది. పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసాత్మక సంఘటనలపై కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో విచారణకు నియమించిన సిట్ బృందం శనివారం రంగంలోకి దిగింది. సాయంత్రం నుంచి రాత్రి 9 గంటల వరకు సిట్ బృందంలోని సభ్యురాలు ఏసీబీ ఏఎస్పీ సౌమ్యలత విచారణ చేశారు. నరసరావుపేట రెండో పట్టణ, రెంటచింతల పోలీస్‌స్టేషన్ల పరిధిలో జరిగిన ఘటనలు, నమోదైన కేసుల వివరాలను స్థానిక పోలీసు అధికారుల నుంచి సేకరించారు. నరసరావుపేటలో పోలింగ్ రోజున జరిగిన రెండు హత్యాయత్నం, రెండు అట్రాసిటీ, ఓ కారు దహనం కేసుల వివరాలను సౌమ్మలత పరిశీలించారు. అనంతరం రెంటచింతల పోలీసు స్టేషన్ సందర్శించిన సిట్ బృందం మండలంలో జరిగిన ఘటనలపై వివరాలను సేకరించింది. నమోదైన కేసులు, వాటి ఎఫ్‌ఐఆర్‌లను పరిశీలించింది. దాడుల్లో గాయపడిన వారి వివరాలతో పాటు వారు ఎక్కడ చికిత్స పొందుతున్నారన్న వివరాలను తీసుకున్నారు. పిన్నెల్లిలో ఈవీఎంలను ధ్వంసం రెంటాలలో పోలింగ్ ఏజెంట్లపై వేట కొడవళ్లతో దాడి, జెట్టిపాలెం, తమ్మకోట గ్రామాల్లో జరిగిన ఘర్షణలపై సిట్ వివరాలను సేకరించింది. కారంపూడిలో మరణాయుధాలతో స్వైర్వవిహారం చేసిన సంఘటన వివరాలను సిట్ సేకరిస్తోంది. గురజాల, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గాల్లో జరిగిన ఘటలపై సిట్ వివరాలు సేకరించనున్నది.

అరెస్టులు.. ఆందోళనలు

జిల్లాలో పోలింగ్ విధ్వంసాలు, దాడులపై సిట్ బృందం విచారణను ముమ్మరం చేసింది. ఆదివారానికి విచారణను పూర్తి చేసి ఈసీకి నివేదిక పంపనుంది. ఈ క్రమంలో గొడవలతో సంబంధం ఉన్న రాజకీయ పార్టీ నేతల అరెస్టుకు రంగం సిద్ధమవుతుందని సమాచారం. ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసులపైనా చర్యలుకు సమాయత్తమవుతున్నారు. అడ్డగోలుగా వ్యవహరించిన పోలీసు అధికారులపై చర్యలు కఠినంగా ఉంటాయన్న ప్రచారం జరుగుతోంది. దీంతో అటు పోలీసు అధికారులు, ఇటు రాజకీయ నేతలు ఆందోళనలో ఉన్నారు. ఘటనలకు సంబంధించిన రాజకీయ పార్టీల నేతలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఇప్పటికే మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరులు మాచర్ల వదలి పరారైన విషయం తెలిసిందే.

పోలీసు పహారా.. తనిఖీలు

- పల్నాడులో కొనసాగుతున్న 144 సెక్షన్
- పలువురిపై కేసులు నమోదు.. కోర్టులో హాజరు
- కారంపూడిలో మద్యం అమ్మకాలపై విమర్శలు
- వైసీపీ నేతలకు చెందిన రెండు స్కార్పియోలు స్వాధీనం

మాచర్లటౌన్, కారంపూడి, రెంటచింతల, దుర్గి, దాచేపల్లి, గురజాలటౌన్, నకరికల్లు, మే 18: ఐదో రోజు పల్నాడు జిల్లాలో 144 సెక్షన్ కొనసాగింది. పోలీసులు పికెట్లు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు.



విచారణలో సిట్ అధికారిణి సౌమ్యలత

అనుమానిత ప్రాంతాలు, ఇళ్లలో సోదాలు చేస్తున్నారు. ఐదు రోజులుగా జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో 144 సెక్షన్‌తో కర్ఫ్యూ వాతావరణం నెలకొంది. పోలీసులు దుకాణాలను తెరవనీయడంలేదు. అయితే కారంపూడి తదితర ప్రాంతాల్లో వైన్ షాపులు మాత్రం తెరుచుకుంటున్నాయి. కారంపూడిలోని రెండు వైన్ షాపుల్లో యథేచ్ఛగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వైన్ షాపులకు 144 సెక్షన్ వర్తించదా అని ప్రజలు విమర్శిస్తున్నారు. కారంపూడి మండలంలోని ఒప్పిచర్లలో టీడీపీ, వైసీపీ నేతల గృహాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. కాగా ఓ వైసీపీ నేత గృహంలో మాత్రం సుమారు 30 నాటు కర్రలు దొరికాయి. వీటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దుర్గి మండలం జంగమహేశ్వరపాడులో పోలీసులు తనిఖీలు చేశారు. గ్రామంలోని ప్రతి ఇంటితో పాటు శిథిలావస్థలో ఉన్న గృహాలను, గడ్డి వాముల్లో కూడా పెద్దసంఖ్యలో గ్రామానికి వచ్చిన పోలీసులు తనిఖీ చేశారు. గురజాల మండలం పల్లెగుంత గ్రామంలో సీఐ బాలకృష్ణ, ఎస్‌ఐలు సౌందర్‌రాజన్, అనంతకృష్ణ ఆధ్వర్యంలో తనిఖీలు జరిగాయి. ఘర్షణలకు దిగినా, శాంతిభద్రతలకు భంగం వాటిల్లినా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. నకరికల్లు మండలం చేజర్లలో ఎస్‌ఐ పీ రాంబాబు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఇప్పటి వరకు గుండ్లపల్లిలో మూడు, రూపెనగుంట్ల, చేజర్లలో రెండేసి కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. దాచేపల్లి మండలం రామాపురం గ్రామంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల గృహాలు, గడ్డివాములు, ఎరువుల దిబ్బలు, పశువుల పాకల్లో తనిఖీల్లో చేశారు. పోలింగ్ గొడవలకు సంబంధించి ఇప్పటి వరకు 170 మందిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. శనివారం 10 మందిని కోర్టుకు హాజరుపరుచగా మరో 10 మందిని త్వరలో కోర్టులో హాజరుపరుచగనున్నట్లు తెలిపారు. మిగిలిన 150 మందికి స్టేషన్ బెయిల్ ఇచ్చి విడుదల చేశారు. రెంటచింతల మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన దాడులకు సంబంధించి 32 మందిపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. రెంటాలలో జరిగిన భౌతిక దాడులకు సంబంధించి 9 మందిపై కేసు నమోదు చేశారు.



గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

తుమ్మకోట, పాలువాయిగేట్, జెట్టిపాలెం, గోలి గ్రామాల్లో ఈవీఎంల ధ్వంసంతో పాటు చెదురుముదురు సంఘటనలకు భాధ్యులైన వారిపై కేసులు పెట్టారు. నిందితులను అరెస్ట్ చేయడానికి స్పెషల్ టీంలను ఏర్పాటు చేశారు. కారంపూడిలో దాడులకు సంబంధించి టీడీపీకి చెందిన 11 మంది, వైసీపీకి చెందిన 11 మందిపై కేసులు పెట్టారు. వీరిని శనివారం గురజాల కోర్టులో హాజరుపరిచారు. మాచర్లలో అనుమానాస్పదంగా తిరుగుతున్న రెండు స్కార్పియో వాహనాలను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. క్రికెట్ వికెట్స్, నాటు కర్రలు ఆ వాహనాల్లో లభ్యమైనట్లు సమాచారం. వాహనాల్లోని వ్యక్తులు పోలీసులను చూసి పారిపోయినట్లు తెలుస్తోంది. ఓ వాహనం మాచర్ల మండలానికి చెందిన వైసీపీ నేతది కాగా, మరో వాహనం వెల్దుర్తి మండలం వైసీపీ నేతదని సమాచారం. అయితే దీనిపై పూర్తి సమాచారం తెలిపేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు.

విషమంగానే గోపాలరెడ్డి ఆరోగ్యం

రెంటచింతల మండలం రెంటాలలో పోలింగ్ రోజు వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన టీడీపీ నేత చేరెడ్డి గోపాలరెడ్డి ఆరోగ్యం శనివారం రాత్రి వరకు విషమంగానే ఉందని కుటుంబీకులు తెలిపారు. గుంటూరులో ప్రైవేటు ఆస్పత్రి ఐసీయూలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యంపై వైద్యులతో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడారు. వైద్యపరంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి బ్రహ్మారెడ్డి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో మాట్లాడారు.



నరసరావుపేటలో షాపులు మూయిస్తున్న పోలీసులు

144 సెక్షన్.. ఇంకెన్ని రోజులు

ప్రజలు అవస్థలు.. వ్యాపారుల విలవిల

నరసరావుపేట: పల్నాడులో పోలింగ్, తదుపరి జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో మంగళవారం జిల్లా అంతటా 144 సెక్షన్ విధించారు. అప్పటి నుంచి పట్టణాల్లో దుకాణాలను పోలీసులు తెరవనీయడంలేదు. 144 సెక్షన్ ఐదో రోజు శనివారం కూడా కొనసాగింది. గతంలో 144 సెక్షన్ సందర్భంగా దుకాణాలను మూయించిన దాఖలాలు లేవు. ఈ సారి అప్రకటిత కర్ఫ్యూని అమలు చేస్తుండటంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇంకెన్ని రోజులు 144 సెక్షన్‌ను అమలు చేస్తారని అటు వ్యాపారులు ఇటు సామాన్య ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐదు రోజులుగా దుకాణాల మూతతోవ్యాపారులు విలవిలాడుతున్నారు. రోజువారీ పనులకు వెళ్తే కానీ పూటగడవని కార్మిక కుటుంబాలను 144 సెక్షన్ తీవ్రంగా ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తుంది. 144 సెక్షన్ అంటే దుకాణాలు మూయాల్సిన అవసరం లేదు. ముగ్గురికి మించి ఒకే చోట గుమికూడ కూడదు. దీనిని వదిలేసి ఉదయం 9 గంటల కల్లా పోలీసులు బలవంతంగా దుకాణాలను మూయిస్తుండటంపై ఆయా వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యకతమవుతుంది. హింసాత్మక సంఘటనలు జరగకుండా నిరోధించడంలో విఫలమైన పోలీసులు జరిగిన తర్వాత సామాన్య ప్రజల జీవనానికి గండి కొడుతున్నారన్న విమర్శలున్నాయి. నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, గురజాలల్లో కఠినంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. అసలు అల్లర్లు జరగని చిలకలూరిపేటలో కూడా దుకాణాలను మూసివేయాలని పోలీసుల ఆదేశాలపై పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. 144 సెక్షన్ తొలగించాలని, షాపులను తెరపించాలని, తమకు ఉపాధి కల్పించాలని పలువురు పోలీసుశాఖను కోరుతున్నారు.

హిట్ లిస్ట్‌లో ఏముంది?



తమిళ దర్శకుడు విక్రమన్ తనయుడు విజయ్ కనిష్క హీరోగా నటిస్తున్న చిత్రం 'హిట్ లిస్ట్'. సూర్య కతిర్ కాకల్లార్, కార్తికేయన్ సంయుక్తంగా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం టీజర్‌ను తమిళ హీరో సూర్య శుక్రవారం విడుదల చేశారు. ప్రస్తుతం ప్రేక్షకులు క్రైమ్, సస్పెన్స్ జానర్ చిత్రాలను ఎక్కువగా ఆదరిస్తున్నారనీ, అదే జానర్‌లో వస్తున్న ఈ సినిమా కూడా అందరినీ అలరిస్తుందనీ నిర్మాతలు ధీమా వ్యక్తం చేశారు. శరత్‌కుమార్, సముద్రఖని, గౌతమ్ వాసుదేవ మీనన్, సితార తదితరులు నటిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో శ్రీనివాసా ఫ్రిక్స్, బెక్కం ప్రొడక్షన్స్ సంస్థలు విడుదల చేస్తున్నాయి.

సిద్ధార్థ్ 40వ చిత్రం



తెలుగు, తమిళ భాషల్లో మంచి నటుడుగా గుర్తింపు పొందిన సిద్ధార్థ్ తన తాజా చిత్రం వివరాలు వెల్లడించారు. ఇది ఆయనకు 40వ చిత్రం కావడం విశేషం. తెలుగు, తమిళ భాషల్లో రూపుదిద్దుకొనే ఈ చిత్రానికి శ్రీగణేశ్ దర్శకత్వం వహించనున్నారు. అరుణ్ విశ్వ నిర్మాత. ఈ సినిమా గురించి సిద్ధార్థ్ మాట్లాడుతూ 'ఈ మధ్య నేను చాలా కథలు విన్నా. శ్రీగణేశ్ చెప్పిన కథ బాగా నచ్చింది. మంచి నిర్మాత అరుణ్ విశ్వతో పని చేయడం ఆనందంగా ఉంది' అన్నారు. 'నేను స్ర్కిప్ట్ మీద వర్క్ చేస్తున్నప్పుడు యూత్‌తో పాటు పరిణితి కలిగిన నటుడు కావాలనుకున్నాను. అప్పుడే సిద్ధార్థ్ గుర్తుకు వచ్చారు. ఆయన కథ విని మెచ్చుకుని, కొన్ని సూచనలు కూడా ఇచ్చారు' అని దర్శకుడు గణేశ్ చెప్పారు. 'శాంతి టాకీస్ అని మా అమ్మ పేరు బేనరుకు పెట్టాం. ఆవిడ థియేటర్‌లో చూసి ఆనందించే సినిమాలే తీస్తాను. ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరించే కమర్షియల్ చిత్రాలు తీస్తాను. వచ్చే నెలలో ఈ సినిమా షూటింగ్ మొదలవుతుంది. పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం' అని నిర్మాత అరుణ్ విశ్వ చెప్పారు.

క్యూట్‌గా స్వీట్‌గా



చైతన్యారావు, హెబ్బాపటేల్ జంటగా నటించిన చిత్రం 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్'. తనికెళ్ల భరణి, సుహాసిని ముఖ్య పాత్రలు పోషించారు. బాల రాజశేఖరుని దర్శకత్వంలో కేకేఆర్, బాలరాజ్ నిర్మించారు. ఈ చిత్రం నుంచి 'క్యూట్‌గా స్వీట్‌గా' అంటూ సాగే గీతాన్ని హీరో అడివిశేష్ చేతుల మీదుగా చిత్రబృందం విడుదల చేసింది. కిట్టూ విస్సాప్రగడ్ సాహిత్యం అందించగా, దీపు ఆలపించారు. కల్యాణి మాలిక్ స్వరాలు సమకూర్చారు. 'క్యూట్‌గా స్వీట్‌గా పాట సాహిత్యం బావుంది. 'హనీమూన్ ఎక్స్‌ప్రెస్' చిత్రం ఘన విజయం సాధించాలి' అని అడివి శేష్ ఆకాంక్షించారు. ఇదొక మ్యూజికల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ అని దర్శకుడు చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

సినిమావాళ్ల కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్ ప్రధాన తారాగణంగా హరీష్ చావా దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఇట్లు... మీ సినిమా'. నేరి నాగప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్టర్‌ను దర్శకుడు కోదండరామిరెడ్డి చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. సినీరంగంలో రాణించాలనే తపనతో నలుగురు స్నేహితులు చేసిన ప్రయత్నాల నేపథ్యంలో కథ సాగుతుందని దర్శకుడు తెలిపారు. ప్రతి సినిమా వ్యక్తి, ఇది తన కథే అని ఫీలయ్యేలా ఉంటుందని నిర్మాత చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: మీరావలి.

అనంతపురం అమ్మాయి ప్రేమకథ



అనంతపురం అమ్మాయి సుమయా రెడ్డి చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టి నిర్మాతగా, కథారచయిత్రిగా, హీరోయిన్‌గా 'డియర్ ఉమ' చిత్రంతో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. సాయి రాజేశ్ మహదేవ్ ఈ సినిమాకు దర్శకుడు. సుమయా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం సినిమా నుంచి స్పెషల్ పోస్టర్, 'నీవెవ్వరో' పాట విడుదల చేశారు. మెలోడీ ట్యూన్‌తో ఈ పాట ఆకట్టుకుంటోంది. నిర్మాతగా తనకు ఇదే తొలి సినిమా అయినా ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీస్థాయిలో ఈ ప్రేమకథను నిర్మించారు సుమయా రెడ్డి. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలో విడుదల తేదీ ప్రకటించనున్నారు.

రొమాంటిక్ సిల్క్ శారీ



వాసుదేవ్‌రావు, రీనా చౌదరి, ప్రీతీ గోస్వామి హీరోహీరోయిన్లుగా నటించిన 'సిల్క్ శారీ' చిత్రం ఈ నెల 24న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శనివారం ప్రసాద్ ప్రివ్యూ థియేటర్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు మురళీమోహన్, శ్రీకాంత్, శివాజీ రాజా, ఉత్తేజ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నిర్మాత రమలేష్ కుమార్ మాట్లాడుతూ 'ఒక మంచి సినిమాతో బాలీవుడ్‌లోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది. మా బేనరుపై వరుసగా చిత్రాలు నిర్మిస్తాం' అని చెప్పారు. దర్శకుడు టి.నాగేందర్ మాట్లాడుతూ 'ఇదొక సరికొత్త రొమాంటిక్ లవ్ స్టోరీ. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చే అంశాలు ఉన్నాయి. హీరో వాసుదేవ్‌రావు కెరీర్‌లో గుర్తుండిపోయే చిత్రమవుతుంది' అని చెప్పారు.

మ్యూజికల్ జర్నీ



ప్రియతమ్ మంతిని, విజయ విక్రాంత్, అనంత పద్మశాల, అంజన బాలాజీ తదితరులు నటించిన మ్యూజికల్, ఫీల్‌గుడ్ ఫిల్మ్ 'నీ దారే నా కథ'. వంశీ జొన్నలగడ్డ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తూ తేజేశ్ వీర, శైలజ జొన్నలగడ్డతో కలసి నిర్మించారు. జూన్ 14న సినిమాను విడుదల చేయనున్నట్లు ఆయన వెల్లడించారు. 'ఇది మ్యూజికల్ బేస్డ్ ఫిల్మ్. స్నేహం, కలలు సాధించాలనే సంకల్పం, తండ్రీకొడుకుల బంధం.. వంటి అంశాలతో ఆసక్తికరంగా సాగుతుంది. ప్రేక్షకులు భావోద్వేగాల రోలర్ కోస్టర్‌లా ఫీల్ అవుతారు. సంగీతం స్వరాన్ని సెట్ చేస్తుంది. అద్భుతమైన సంగీతం, ఎమోషన్స్‌తో ఓ మధురమైన ప్రయాణంలా చిత్రం ఉంటుంది' అని శివ జొన్నలగడ్డ చెప్పారు. ఈ చిత్రానికి రచన: మురళీకాంత్, వంశీ జొన్నలగడ్డ, సంగీతం: ఆల్బర్టో గురియోలి, సినిమాటోగ్రాఫర్: ఎలెక్స్ కావు.



శ్రీ సిటీ ఐఐఐటీలో పీహెచ్‌డీ



చిత్తూరు, శ్రీసిటీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీ) - పీహెచ్‌డీ (మాన్‌సూన్ 2024) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైమ్, పార్ట్ టైమ్ విధానాల్లో ప్రోగ్రామ్ అందుబాటులో ఉంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా ఆరేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. గరిష్ఠంగా ఏడేళ్లలో పూర్తిచేయాల్సి ఉంటుంది. ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌లో చేరిన అభ్యర్థులకు నిబంధనల ప్రకారం ఫెలోషిప్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్.

అర్హత: సీఎస్‌ఈ, ఈసీఈ విభాగాల్లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణతతోపాటు ఎంఈ/ ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఎమ్మెస్సీ(కంప్యూటర్స్/ఎలక్ట్రానిక్స్/ఫిజిక్స్) పూర్తిచేసి ఉండాలి. మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి మాస్టర్స్(స్టాటిస్టిక్స్/మేథమెటిక్స్) ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ, పీజీ స్థాయిల్లో ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. కనీసం 8 సీజీపీఏ స్కోర్‌తో (బీఈ/బీటెక్)(సీఎస్‌ఈ/ఈసీఈ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు నేరుగా పీహెచ్‌డీలో చేరవచ్చు. వీరు సంబంధిత రీసెర్చ్ పేపర్స్ సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు ఐటీ ప్రొఫెషనల్స్; డీఆర్‌డీఓ, ఇస్రో తదితర సంస్థల్లో పనిచేస్తున్న రీసెర్చ్ సైంటిస్ట్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి. పీహెచ్‌డీ అడ్మిషన్ కమిటీ రికమండ్ చేసిన అభ్యర్థులు కూడా అర్హులే.

ఎంపిక: ఫుల్ టైమ్ ప్రోగ్రామ్‌నకు రాత పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. రాత పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. పార్ట్ టైమ్ ప్రోగ్రామ్‌నకు టెక్నికల్ ఇంటర్వ్యూ, రీసెర్చ్ ప్రపోజల్ ప్రజంటేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.500; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** iiits.ac.in

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎస్సీలో బీటెక్

బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(ఐఐఎస్సీ)- బీటెక్(మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఎనిమిది సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, సాఫ్ట్ కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 52 సీట్లు ఉన్నాయి. అభ్యర్థులు మరో ఏడాది చదివి ఎంటెక్ డిగ్రీ పొందే వీలుంది. హాస్టల్ సౌకర్యం ఉంది. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ఐటీ, డేటా అనలిటిక్స్, ఫిన్‌టెక్ సంస్థల్లో ప్లేస్‌మెంట్స్ పొందవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అర్హత తప్పనిసరి.

ఎంపిక: 2024 జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సాధించిన ర్యాంక్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 17
- **వెబ్‌సైట్:** btechug.iisc.ac.in/

ఎన్ఐఈపీఐడీలో ప్రోగ్రామ్‌లు



సికింద్రాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటీస్(ఎన్ఐఈపీఐడీ)- డిప్లొమా, డీఈడీ, బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. సికింద్రాబాద్ సహా కోల్‌కతా, నవీ ముంబై, నోయిడా, సీఆర్‌సీ సెంటర్లలో ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. డిప్లొమా వ్యవధి ఏడాది. మిగిలిన ప్రోగ్రామ్‌ల వ్యవధి రెండేళ్లు. డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు కౌన్సెలింగ్, ఇంటర్వ్యూల ద్వారా; బీఈడీ, ఎంఈడీ ప్రోగ్రామ్‌లకు ఎంట్రెన్స్ టెస్ట్, కౌన్సెలింగ్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లన్నింటికీ ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా సెంటర్లకు దరఖాస్తు చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

సికింద్రాబాద్ సెంటర్‌లోని ప్రోగ్రామ్‌లు - సీట్లు

- డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్(స్పెషల్ ఎడ్యుకేషన్-ఐడీడీ) - 38 సీట్లు
- డిప్లొమా - ఎర్లీ చైల్డ్‌హుడ్ స్పెషల్ ఎడ్యుకేషన్ 33 సీట్లు, ఒకేషనల్ రీహాబిలిటేషన్ 33 సీట్లు

అర్హత: బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌నకు ద్వితీయ శ్రేణి మార్కులతో బీఏ/బీకాం/బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశానికి బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్/జనరల్ ఎడ్యుకేషన్) లేదా ఇంటిగ్రేటెడ్ బీఏ/బీకాం/బీఎస్సీ-బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ఉండాలి. డిప్లొమా, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లకు ద్వితీయ శ్రేణి మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్ వివరాలు: ఇది ఆబ్జెక్టివ్ టెస్ట్. ఇందులో జనరల్ మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జ్, జనరల్ ఇంగ్లీష్, బ్రాడ్ యాస్పెక్ట్స్ ఆఫ్ జనరల్ ఎడ్యుకేషన్ అండ్ స్పెషల్ ఎడ్యుకేషన్ అంశాల నుంచి 100 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంటన్నర.

- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సికింద్రాబాద్, కోల్‌కతా, సీఆర్‌సీ సెంటర్లు-జూన్ 14; నవీ ముంబై సెంటర్-ఎంఈడీ, బీఈడీ ప్రోగ్రామ్‌లకు జూలై 26, డీఈడీ, డిప్లొమా ప్రోగ్రామ్‌లకు జూన్ 13; నోయిడా సెంటర్-జూన్ 5
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీలు:** కోల్‌కతా సెంటర్ - జూన్ 30; నవీ ముంబై - ఆగస్టు 10
- **వెబ్‌సైట్:** www.niepid.nic.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/VTVnpuoలో చదవండి.





తెలంగాణ ఈఏపీసెట్‌లో భాష్యం విద్యార్థుల సత్తా



ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఎం.సాయియశ్వంత్‌రెడ్డి, ఎం జిష్ణుసాయి, కె హర్షిత కె మనీష్ చౌదరి, కె ప్రభాస్

గుంటూరు(విద్య), మే 18: తెలంగాణ ఈఏపీ సెట్‌లో భాష్యం విద్యా సంస్థలు 100 లోపు 12 ర్యాంకులు సాధించి మరో సారి సత్తాచాటాయని సంస్థల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీఎస్‌ఈ ఏపీసెట్‌లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి 11, కె.హర్షిత 13, కె.మనీష్‌చౌదరి 28, కె.ప్రభాస్ 31, టి.మునికార్తీక్ 58, పి.శ్యామ్ 63, ఎం.సాయిజశ్వంత్‌రెడ్డి 65, ఎ.గణేష్ దత్తా 93, ఎం.శ్రీచరిత సాయి 94, డి.పూజ 97, కె.ఆర్.ఎస్.వి. సుమన్విత 100వ ర్యాంకు సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో తమ విద్యార్థులు 100లోపు 12 ర్యాంకులతో భాష్యం ది బెస్ట్ అని నిరూపించారన్నారు. భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ, మెడెక్స్ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ భాష్యం హనుమంతరావు అభినందనలు తెలిపారు.

చంద్రబాబును కలిసిన యరపతినేని



పిడుగురాళ్ల, మే 18: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడ్ని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా శనివారం కలిశారు. రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తుందని అలాగే గురజాలలో మంచి మెజార్టీతో గెలుపొందుతానని ఆయన చంద్రబాబుకు వివరించారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేశారన్నారు. ఎన్నికల రోజున ఈవీఎంలను ధ్వంసం చేయడానికి వైసీపీ నాయకులు చేసిన అనేక ప్రయత్నాలను, టీడీపీ శ్రేణులపై వైసీపీ నేతలు జరిపిన దాడులను ఉమ్మడి పార్టీ నాయకులు, కార్యకర్తలు అన్ని ప్రాంతాల్లో సమర్థంగా ఎదుర్కొన్న విషయాన్ని కూడా వివరించారు.

తాడికొండదే.. తొలి ఫలితం

● ఈ నియోజకవర్గం నుంచి బరిలో కేవలం 10 మంది అభ్యర్థులే ● పోలింగ్ బూత్‌లు కూడా 244 మాత్రమే ● మిగతా నియోజకవర్గాలతో పోల్చితే ఓటర్ల సంఖ్య తక్కువే

గుంటూరు, మే 18 (ఆంధ్రజ్యోతి): ఓట్ల లెక్కింపు తేదీ దగ్గర పడుతుండటంతో అందరిలోనూ టెన్షన్ నెలకొంది. అటు అభ్యర్థులు, ఇటు ఓటు వేసిన ప్రజల్లోనూ ఒకటే పరిస్థితి. తాము గెలవాలని అభ్యర్థులు, ఓటేసిన అభ్యర్థి గెలవాలని ఓటర్లు నిత్యం జూన్ 4వ తేదీ కోసం రోజులు లెక్కిస్తున్నారు. క్షణం ఒక యుగంలా గడుపుతున్నారు. కాగా జిల్లాలో ఎన్నికలు జరిగిన ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, ఒక పార్లమెంట్ స్థానంలో అన్నింటి కంటే తొలుత ఫలితం వెలువడేది అమరావతి రాజధాని ప్రాంతం కలిగిన తాడికొండ నియోజకవర్గమే. ఇందుకు ప్రధాన కారణం ఈ నియోజకవర్గంలో ఓటర్ల సంఖ్య తక్కువగా ఉండటం, పోటీలో నిలిచిన అభ్యర్థులు కూడా పది మందే కావడం, పోలింగ్ బూత్‌ల సంఖ్య కూడా తక్కువ తదితర కారణాలతో తాడికొండ ఫలితం తొలుత వెలువడుతుందని అధికారవర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తాడికొండలోనే ఓటర్ల సంఖ్య తక్కువగా ఉంది. ఇక్కడ ఓటర్ల సంఖ్య 2 లక్షల 7 వేల 615గా ఉన్నది. ఈ నేపథ్యంలో తక్కువ పోలింగ్ బూత్‌లు అవసరమయ్యాయి. మిగతా నియోజకవర్గాల్లో 255కి పైగా పోలింగ్ బూత్‌లు ఉంటే తాడికొండలో 244 మాత్రమే ఉన్నాయి. దీంతో ఆయా నియోజకవర్గాలతో పోల్చితే ఒక రౌండ్ ముందుగానే ఓట్ల లెక్కింపు పూర్తి అయి ఫలితం వెలువడుతుంది. పైగా ఇక్కడ అభ్యర్థులు కేవలం 10 మందే కావడం వలన ఈవీఎంలో ఓట్ల లెక్కింపునకు కూడా తక్కువ సమయం తీసుకొంటుంది. ఓట్ల లెక్కింపు సందర్భంగా 14 టేబుల్స్‌ని కౌంటింగ్ హాల్‌లో ఏర్పాటు చేస్తారు. అలానే రిటర్నింగ్ అధికారి టేబుల్ వద్ద పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు సమాంతరంగా జరుగుతుంటుంది. ఈ నేపథ్యంలో రాజధానిలో ఏ పార్టీ అభ్యర్థి జెండా ఎగుర వేస్తారనేది తొలుత తేలిపోతుంది. పోలింగ్ బూత్‌లు ఎక్కువ సంఖ్యలో ఉన్న మంగళగిరి, గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు నియోజకవర్గాల ఎన్నికల ఫలితాలు మిగతా వాటి కంటే ఆలస్యమౌతాయి. ముఖ్యంగా మంగళగిరిలో 300 పోలింగ్ బూత్‌లున్నాయి. అంతేకాకుండా ఇక్కడి నుంచి 40 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీని వలన ఒక్కో ఈవీఎం ఓట్ల లెక్కింపు పూర్తి చేయడానికి ఎక్కువ సమయం తీసుకొంటుంది. ఆ తర్వాత గుంటూరు పశ్చిమలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంటుంది. ఈ నియోజకవర్గంలో 291 పోలింగ్ బూత్‌లు, 28 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. దీని వలన పశ్చిమ ఫలితం కూడా ఆఖరునే వస్తుంది. ప్రత్తిపాడులో అభ్యర్థుల సంఖ్య 13 తక్కువైనప్పటికీ 288 పోలింగ్ బూత్‌లున్నాయి. దీంతో మంగళగిరి, పశ్చిమ కంటే ఈ నియోజకవర్గం ఫలితం ముందుగా వస్తుంది.

కోర్టు ఆదేశాలు.. బేఖాతరు

● అధికారులు ఎన్నికల విధుల్లో ● కొనసాగుతున్న ఆక్రమణల జోరు..



పిడుగురాళ్ల చెరువు స్థలంలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణం, వాగు పోరంబోకు స్థలంలో నిర్మాణం చేపట్టిన కమర్షియల్ కాంప్లెక్స్

పిడుగురాళ్ల, మే 18: చెరువు భూముల్లో.. వాగు పోరంబోకుల్లో నిర్మాణాలు చేపట్టవద్దని, ఇప్పటికే చేపట్టిన నిర్మాణాలపై నివేదిక ఇవ్వాలన్న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను పట్టించుకోకుండా పిడుగురాళ్ల, పరిసర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పిడుగురాళ్ల ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న భూముల్లో అధికార పార్టీ నేతల అండదండలతో కొందరు స్థలాలను ఆక్రమించుకోగా మరికొందరు ఏకంగా గృహాలను నిర్మించారు. ఆదేమిటని అడిగే అధికారులు లేకపోవటంతో ఆక్రమణదారులు రెచ్చిపోయి వేరే సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్ పొంది గృహాలను నిర్మించేశారు. పిడుగురాళ్ల పట్టణ మున్సిపల్, గృహ నిర్మాణపు విభాగ అధికారులు అటు వైపు వెళ్లి అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్న గృహాలను అడ్డుకోవటంలో వెనుకంజ వే శారు. ధైర్యం చేసి మున్సిపల్, టౌన్ ప్లానింగ్ అధికారులు చెరువు భూములలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేస్తున్న కట్టడాల వివరాల నివేదికను తయారు చేశారు. ఈలోగా నియోజకవర్గ ముఖ్యనేత ఆక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణాల జోలికి వెళ్లవద్దని వారంతా పేదవారేనని అక్రమ నిర్మాణదారులకు వత్తాసుపలికారు. గత రెండు నెలలుగా అధికార యంత్రాగం మొత్తం ఎన్నికల విధుల్లో ఉండగా అక్రమ నిర్మాణాల జోరు కొనసాగుతూనే ఉంది. ఖాళీ జాగా కన్పిస్తే చాలు తెల్లవారేసరికే పునాదులు వేసేస్తున్నారు. మరో వేరే సర్వే నెంబరుతో రిజిస్ట్రేషన్ పొందిన గృహాలు మరోకరి పేరుతో విద్యుత్ మీటర్ ఏర్పాటు చేసినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. అంతేకాకుండా అద్దంకి- నార్కెట్‌పల్లి రోడ్డుకు సమీపంలో ఉన్న వాగు పోరంబోకు స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మిస్తున్న స్పందించిన అధికారి లేరని చెప్పవచ్చు. పిడుగురాళ్లలో అక్రమ నిర్మాణాలు, పరిసరా ప్రాంతాలలో పుట్ట గొడుగుల్లా వెలుస్తున్న అనధికార ప్లాట్ల నిర్వాహకుల నుండి పెద్దఎత్తున నగదు చేతులు మరటం వలనే సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లీజుకు 'కర్మ' భూమి?

కోడ్ అమల్లో ఉండగా.. కిరికిరి నిర్ణయాలు!

బాపట్ల తూర్పుసత్రం భూమిలో కొంత భాగం ఐవోసీకి

రాష్ట్రస్థాయిలో తీసుకున్న నిర్ణయమన్న దేవదాయశాఖ అధికారులు



బాపట్ల, మే 18 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కర్మకాండల కోసం దశాబ్దాల క్రితం పేరం గురుడాచల నాయుడు అనే వ్యక్తి బాపట్ల పరిసరప్రాంతాల్లో 92 ఎకరాల స్థలాన్ని దానంగా ఇచ్చారు. అందులో కొంత భాగంలో బాపట్ల పట్టణ నడిబొడ్డున తూర్పు సత్రం పేరిట ఓ భవనాన్ని నిర్మించి కర్మకాండలకు ఉపయోగిస్తున్నారు. అక్కడే ఖాళీగా ఉన్న స్థలంపై గతంలోనే పాలకపార్టీ నేతల కన్ను పడింది. 216 ఏ జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు గుంభనంగా అతితక్కువకు లీజుకు ఇచ్చిన అంశం 2022 నవంబరులో వెలుగుచూసింది. ఈ లీజు అంశాన్ని కాపు సంఘాలతో పాటు టీడీపీ, జనసేన పార్టీలు సైతం అప్పట్లో వ్యతిరేకించాయి. తాజాగా అదే స్థలంలో 78 సెంట్లు ఐవోసీ(ఇండియన్ ఆయిల్ కంపెనీ)కి పెట్రోల్ బంకు కోసం లీజుకివ్వడం అది కూడా ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నెల వ్యవధిలోనే ఇదంతా జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది.

గడచిన నెల 1న లెటర్...

బాపట్ల పట్టణ నడిబొడ్డులో ఉన్న పేరం గరుడాచల నాయుడు సత్రం(తూర్పు సత్రం) రోడ్డు పక్కన ఖాళీగా ఉన్న భూమిని పెట్రోలు బంకు కోసం లీజుకు ఇవ్వాలని ఏప్రిల్ 1న ఐవోసీ ప్రతినిధులు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్‌ను ఆశ్రయించినట్లు చెబుతున్నారు. ఆ తర్వాత సీఎస్ స్థాయిలో నిర్ణయం జరిగి ఈ నెల 7న లీజుకు సంబంధించి ఆర్డర్ ఉత్తర్వులను జిల్లా అధికారులకు పంపించి అమలు చేయనున్నట్లు సమాచారం. 78 సెంట్ల భూమిని నెలకు 46 వేలకు లీజుకు ఐవోసీకి ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం వ్యవహారం అంతా ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా జరగడం, అంతా కలిపి నెలలోనే లీజు అంశాన్ని ఒక కొలిక్కి తేవడం వెనక రాజకీయ ప్రమేయం పైనా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి

గతంలోనూ ఒకసారి ఇలానే...

2022 నవంబరులో ఈ సత్రం భూమినే ఎలాంటి వేలం లేకుండా జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్న కాంట్రాక్టర్‌కు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాలను సైతం లెక్క చేయకుండా అధికార పార్టీ నేతలు చక్రం తిప్పడంతో నామమాత్రపు ధరకు లీజుకిచ్చారు. అనుమతులు రాకముందే అక్కడ స్థలాన్ని వాడుకోవడంతో అడుగడుగునా అధికార దుర్వినియోగం పాల్పడడంపై విమర్శలు వెల్లువెత్తాయి

సున్నితమైన అంశంలో ఏకపక్షంగా...

పేరం గరుడాచలంనాయుడు అనే వ్యక్తి బాపట్ల ప్రజల మేలు కోసం విరాళంగా ఇచ్చిన భూమి అది. దాని నిర్వహణ దేవాదాయశాఖే చూస్తున్నప్పటికీ అత్తసొమ్ము అల్లుడుదానం చేసిన చందాన సదరు భూమిని ఐవోసీకి లీజుకివ్వడంపై కాపు సంఘాలతో పాటు టీడీపీ, జనసేన పార్టీలు కూడా మండిపడుతున్నాయి. స్థలాన్ని లీజుకు ఇచ్చేటప్పుడు స్థానికంగా ఉండే అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోకుండా నిబంధనల ప్రకారమే లీజుకు ఇచ్చామని ప్రభుత్వం చెప్పడం పలు అనుమానాలకు తావిస్తోంది

ఆదరాబాదరాగా తీసుకోవాల్సిన అవసరమేమిటి...

బాపట్లలోని తూర్పు సత్రం భూముల విషయం గతంలోనూ వివాదస్పదమైంది. తాజాగా ఇప్పుడు ఐవోసికీ లీజుకివ్వాలనే నిర్ణయం తీసుకోవడంపై బాపట్లవాసులు మండిపడుతున్నారు. యంత్రాంగం ఎన్నికల ప్రక్రియలో నిమగ్నమై ఉన్న సమయంలో ఈ లీజు నిర్ణయం తీసుకోవడం ఒక ఎత్తయితే బాపట్లలో సత్రం భూములు ఖాళీగా ఉన్న విషయం సదరు కంపెనీ ప్రతినిధులకు తెలియడం, వెంటవెంటనే నిర్ణయాలు జరిగిపోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పైగా జిల్లాకు సంబంధించిన దేవదాయ శాఖ యంత్రాంగాన్ని ఆ స్థలం విషయంలో కనీసం సంప్రదించకుండా రాష్ట్రస్థాయిలో నిర్ణయం తీసుకున్నామని చెప్పడం వెనుక రాజకీయ శక్తుల ప్రమేయం పనిచేసిందనే వ్యాఖ్యానాలు జోరుగా వినిపిస్తున్నాయి.

అమరావతి నిర్వీర్యంతో రాష్ట్ర ప్రజలకు నష్టం

● 1614వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

తుళ్లూరు, మే 18: అమరావతి నిర్వీర్యం రాష్ట్ర ప్రజలకు నష్టం కలిగించిందని రాజధాని రైతులు తెలిపారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు శిబిరాలు ఇళ్ల వద్ద చేస్తు న్న ఆందోళనలు, దీక్షలు శనివారం నాటికి 1614వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రాజధానులతో రాష్ట్రానికి ప్రయోజనం కలగదని తెలిసి కూడా సీఎం జగన్‌రెడ్డి దానిని పట్టుకుని వేలాడుతున్నారన్నారు. ఐదేళ్లలో ఓ ఒక్క అభివృద్ధి చేయని జగన్‌రెడ్డి ఈ ఎన్నికల్లో ఓడిపోయి ఇంటికి వెళ్లటం ఖాయమన్నారు. చంద్రబాబు సీఎం అవుతారు.. రైతు రాజ్యం రాబోతుందన్నారు. అమరావతిని అభివృద్ధి చేయమని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం చెప్పినా జగన్‌రెడ్డి పట్టించుకోకపోవటం నియంత పాలనకు నిదర్శనమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నిఘా నీడన..

● స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచల భద్రత
● సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షణ
● పరిశీలించిన ఇంఛార్జ్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

నరసరావుపేట, మే 18: పోలింగ్‌కు సంబంధించిన ఈవీఎం, వీవీప్యాట్‌లు భద్రపరచిన జేఎన్‌టీయు ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్ ప్రాంతాలను శనివారం జిల్లా ఇంఛార్జ్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, అదనపు ఎస్పీ ఆర్ రాఘవేంద్ర ఆకస్మికంగా తనిఖీలు చేసి, భద్రతాపరమైన అంశాలలో సిబ్బందికి తగిన సూచనలు చేశారు. స్ట్రాంగ్ రూంలకు కట్టుదిట్టమైన భద్రత కల్పించామని శ్యామ్ ప్రసాద్ తెలిపారు స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రతా విషయంలో ఈవీఎంలు, వీవీప్యాట్‌ల సురక్షిత అంశాలపై అదనపు ఎస్పీతో కలిసి కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాకు చెందిన 7 అసెంబ్లీ, 1 పార్లమెంటు నియోజవర్గాలకు సంబంధించి పోలింగ్ అయిన బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ అత్యంత జాగ్రత్తగా భద్రపరచడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఎన్నికల ప్రవర్తనా నియమావళి కాలంలో ఆయా ప్రాంతాల్లో జరిగిన హింసాత్మక సంఘటనలపై అదనపు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో రాజకీయ హింసకు సంబంధించిన ఏదైనా సంఘటనకు స్పందించే క్రమంలో ప్రజలు, మీడియా, సంయమనం పాటించడం అత్యంత కీలకమన్నారు. ఇటువంటి సంఘటనలు జరిగిన సందర్భంలో సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని సంబంధిత అధికారులకు ముందస్తు సమాచారం అందించాలని కోరారు. అదే విధంగా జిల్లాలో కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేవరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూము వద్ద విధి నిర్వహణలో ఉన్న సిబ్బందితో మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్‌లో వద్ద అప్రమత్తతతో విధులు నిర్వహించాలన్నారు. ప్రజలు ఎవరు సదరు కాలేజీ చుట్టుపక్కల సంచరించరాదని హెచ్చరించారు.

పిడుగుపడి రైతు మృతి

ఈపూరు, మే 18: పిడుగుపడి రైతు మృతి చెందిన సంఘటన ఈపూరు మండలంలోని ముప్పాళ్ళ లో శనివారం జరిగింది. గ్రామానికి చెందిన కర్రి హనుమంతురావు(40) పశువులను మేత కోసం పొలం తోలుకు వెళ్ళాడు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో వర్షం వస్తుండడంతో దగ్గరలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోకి వెళ్తుండగా పిడుగుపడింది. దీంతో ఆయన కిందపడి మృతి చెందాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

తీరంలో సందడి

బాపట్ల, మే 18: సూర్యలంక సముద్రతీరానికి శనివారం యాత్రీకులు పెద్దసంఖ్యలో వచ్చారు. సముద్ర స్నానాలు చేస్తూ, ఆటలాడుతూ సందడి చేశారు. వేసవి సెలవులు కావటంతో విద్యాసంస్థలు మూసివేయటంతో విద్యార్థులు కుటుంబ సభ్యులతో కలిసి సరదాగా తీరానికి వచ్చి సముద్రస్నానాలు చేస్తూ సంతోషంగా గడిపారు.

హ్యాండ్‌లూమ్ డిప్లొమా ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు(విద్య), మే 18: శ్రీప్రగడకోటయ్య మెమోరియల్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ, వెంకటగిరి, తిరుపతి ఆధ్వర్యంలో పలు డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రాష్ట్రంలోని సదరు విద్యా సంస్థనందు 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12 సీట్లకు, కర్ణాటకలోని గదలో నాలుగు సీట్లకు మూడు సంవత్సరాల హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చేనేత జౌళి శాఖ సహాయసంచాకులు వి.వనజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి లేదా తత్సమాన పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఇందుకు అర్హులని తెలిపారు. ఇతర వివరాల కోసం www.iihtvgr.com వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

గ్రూపు 2 మెయిన్ పరీక్షకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), మే 18: ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల్లో అర్హత సాధించి మెయిన్ పరీక్షలకు సిద్ధం అయ్యే అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంచాలకులు డి.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ఇతర వివరాల కోసం 0863- 2358071 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

జిల్లాలోని ఐటీఐ కళాశాలల్లో ప్రవేశానికి మొదటి విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సహాయ సంచాలకులు ఎస్‌ఎస్‌వీ ప్రసాదరావు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను జూన్ 10లోగా పంపాలని సూచించారు. జూన్ 10లోగా గుంటూరు లేదా తెనాలిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఇతర వివరాల కోసం iti.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	158, 167,178
చికెన్ విత్ స్కిన్	306.00
చికెన్ స్కిన్ లెస్	316.00

జల్లాపేట తండా బ్రిడ్జిని పునర్నిర్మించాలి



నాగార్జున సాగర్ కుడి కాలువపై ప్రమాదకరంగా ఉన్న జల్లాపేట తండా బ్రిడ్జి

నకరికల్లు, మే 18 : నాగార్జునసాగర్ కుడి కాలువపై జల్లాపేట తండాకు వెళ్లేందుకు ఉన్న బ్రిడ్జిని విస్తరించి పునర్నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. కాలువ నిర్మాణ సమయంలో నిర్మించిన ఈ బ్రిడ్జి పలు చోట్ల గుంతలు పడింది. సైడు వాల్స్ కొంత మేర పడిపోయాయి. ఇనుప రెయిలింగ్ చాలా వరకు అపహరణకు గురైంది. ఎదురెదురుగా జంతువులు వచ్చినా, వాహనం వచ్చినా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఉంది. జంతువులు, మనుషులు అదుపు తప్పినా సాగర్ కుడి కాలువలో పడే ప్రమాదం పొంచి ఉంది. 50 సంవత్స రాల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జిని తొలగించి మరింత విస్తరించి కొత్త బ్రిడ్జిని నిర్మించాలని జల్లాపేట తండా ప్రజలు కోరుతున్నారు.

నాగార్జున కొండలో మ్యూజియం డే

విజయపురిసౌత్, మే 18: నాగార్జునకొండ పురావస్తుశాఖ కార్యాలయంలో శని వారం మ్యూజియం డేను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రి వైద్యులు మహేష్, శ్రావణ్ నాయక్‌లు హాజరయ్యారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. పురావస్తు తవ్వకాల్లో బయల్పడిన కరెన్సీని ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమంలో కమలాసన్, వెంకటయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీలు

నరసింహ జయంతి.. మహా అన్నదానం ప్రారంభం

● ఐదు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకుల వెల్లడి



భక్తులకు ఆహారం వడ్డిస్తున్న ఉయ్యందన గ్రామస్థులు

క్రోసూరు, మే 18 : వేదాద్రి పుణ్యక్షేత్రంలో నరసింహ జయంతి సందర్భంగా క్రోసూరు మండలం ఉయ్యందన కాపు సంఘం వారు నిర్వహించే మహా అన్నదాన కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఈ అన్నదానం ఈనెల 22వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకుల్లో ఒకరైన మాజీ సొసైటీ ప్రెసిడెంట్ నీలం రామారావు తెలియజేశారు. ప్రతి సంవత్సరం నరసింహ జయంతి సందర్భంగా అన్నదానం చేయటం ఆనవాయితీగా వస్తున్నదని, 12 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వేదాద్రి పుణ్యక్షేత్రంలో ఐదు రోజుల పాటు అన్నదానం నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. అన్నదాన కార్యక్రమాన్ని వేదాద్రి పుణ్యక్షేత్రం ధర్మకర్త రామ్‌కుమార్, నీలం రామారావు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ప్రతి రోజు ఉదయం సాయంత్రం ఈ అన్నదాన కార్యక్రమం జరుగుతుందని ఉయ్యందన గ్రామానికి చెందిన మాజీ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ అందె సుబ్బారావు తెలిపారు. ఈ నెల 22వ తేదీన నరసింహ జయంతి జరుగుతుందని, అప్పటి వరకు వందలాది మందికి అన్నదానం నిర్వహిస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో నిర్వాహణ కమిటీ సభ్యులు ఉప్పు శ్రీనివాసరావు, సిద్ధి రామారావు, ఉప్పు నరసింహారావు, రెట్టడి వీరాంజనేయులు, లక్ష్మిశెట్టి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



పెదకూరపాడులో వీరబ్రహ్మేంద్ర స్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

పెదకూరపాడు, మే 18 : పెదకూరపాడులోని పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు శనివారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారిని భక్తులు సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించి అనంతరం భారీ అన్న సమారాధనను నిర్వహించారు. వందలాది సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు గల్లా వెంకటరావు, గల్లా వెంకటేశ్వర్లు, కృష్ణమనేని లక్ష్మయ్య, చెరుకూరి శివయ్య తదితరులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారులు బంకా బాబు, నుదురు పాటి హనుమంతరావు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ అనురాధ

నకరికల్లు, మే 18: గ్రామాల్లో నెలకొని ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ ఎం అనురాధ కోరారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎన్నికలు పూర్తయి ఐదు రోజులు గడుస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలకు ఉద్యోగులు హాజరు కావటం లేదని ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విధులకు గైర్హాజరయ్యే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని కోరారు. నకరికల్లులోని తాగునీటి సమస్యపైన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజా ప్రతినిధులు కోరారు. సర్వసభ్య సమావేశం గురించి అధికారులకు గాని, ప్రజా ప్రతినిధులకు గాని సమాచారం అందించ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి సమా వేశం నిర్వహించాలి కాంబట్టి మొక్కుబడిగా సమావేశాన్ని నిర్వహించి మమ అనిపించారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు సైతం సాధారణ సర్వసభ్య సమావేశానికి హాజరు కాలేదు. ఇక నుంచైనా నిబంధనల ప్రకారం సమావేశం నిర్వహించి అందరికీ తెలియ జేయాలని ప్రజాప్రతినిధులు కోరారు. సమావేశానికి గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

10వేల ఆర్థిక సాయం

ముప్పాళ్ళ మే 18: మండలంలోని దమ్మాలపాడులో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబాన్ని గ్రామానికి చెందిన జనసేన మండల అధ్యక్షుడు శిరిగిరి పవన్‌కుమార్, టీడీపీ నాయకులు శిరిగిరి గోపాళరావు, అత్తోట పూర్ణయ్యలు పరామర్శించి 10వేలు ఆర్థిక సాయాన్ని అందించారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వారివెంట కామర్తి వెంకటేశ్వర్లు, తోడేటి రవి, శిరిగిరి ప్రసాద్, రుద్రజడ బుల్లబ్బాయ్, ఎస్‌కే బాషా, ఎస్‌కే మదార్ తదితరులున్నారు.

విద్యార్థి ప్రతిభ

సత్తెనపల్లి, మే 18: పట్టణంలోని కేంద్రీయ విద్యాలయానికి సంబంధించిన విద్యార్థి కే గిరీష్ వెంకట ధీరజ్ అత్యధిక మార్కులు సాధించి పల్నాడు జిల్లా పరిధిలో అగ్రస్థానంలో నిలిచాడు. ఈ విద్యార్థిని కేంద్రీయ విద్యాలయ నిర్వాహకులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

కొనసాగుతున్న 144 సెక్షన్

● మాచర్లలో పాక్షికంగా తెరుచుకున్న దుకాణాలు
● నిర్మానుష్యంగా రహదారులు ● గ్రామాల్లో పోలీసుల తనిఖీలు

క్రోసూరు, మే 18 : పల్నాడు జిల్లాలో ఎన్నికల సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తటంతో జిల్లా అధికారుల నిర్ణయం మేరకు క్రోసూరు మండలంలో శనివారం మూడో రోజు కూడా 144 సెక్షన్, దుకాణాల మూసివేత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్రోసూరు, దొడ్లేరు, ఊటుకూరు, బయ్యవరం తదితర గ్రామాల్లో దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థలు మూసి వేశారు. రోడ్లన్నీ లాక్‌డౌన్ నాటి పరిస్థితులతో నిర్మానుష్యంగా కన్పించాయి. 144 సెక్షన్ మూలంగా తమ వ్యాపారాలు మూత పడ్డాయని, ఉపాధి లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నామని, బార్బర్ షాపులు, పండ్ల దుకాణాలు, చిన్న చిన్న హోటళ్ళ యజమానులు వాపోతున్నారు. ఇప్పటికే మూడు రోజులైందని, ఆదివారం కూడా వ్యాపారాలు ఉండవని, గతంలో అనేక సార్లు ఎన్నికలు జరిగినప్పటికీ ఇటువంటి పరిస్థితులు ఎప్పుడూ లేవని చిరువ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. 144 సెక్షన్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సివిల్ పోలీసులు, ప్రత్యేక పోలీసులు వీధుల్లో తిరుగుతూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

మాచర్ల పట్టణంలో..



మాచర్ల పట్టణంలో దుకాణాలు నిర్వహిస్తున్న వ్యాపారులు



క్రోసూరులో నిర్మానుష్యంగా ఉన్న రహదారులు

మాచర్లటౌన్, మే 18: మాచర్ల పట్టణంలో 144 సెక్షన్ శనివారం నాటికి ఐదో రోజుకు చేరుకుంది. పోలీసులు ఉదయం 11 గంటల వరకు షాపులు తెరిపించినా తరువాత గంటసేపు హడావిడి చేసి మూసివేయించారు. తదుపరి పాక్షికంగా దుకాణాలు తెరిచి వ్యాపారాలు కొనసాగాయి. పోలీసులు వాహనాల తనిఖీలు కొనసాగించారు. గ్రామాల్లో కూడా పోలీసులు ప్రత్యేకంగా తనిఖీ చేపట్టారు. ప్రస్తుతానికి నియోజకవర్గంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయి.

సత్తెనపల్లి పట్టణంలో..

సత్తెనపల్లి, మే 18: సత్తెనపల్లి పట్టణంలో 144 సెక్షన్ కొనసాగుతుందని డీఎస్పీ గురునాథ బాబు శనివారం తెలిపారు. కలెక్టర్ వెల్లడించే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయన తెలిపారు. పాలు, కూరగాయలు, మెడికల్ దుకాణాలు తప్ప ఏ దుకాణాలు కూడా తెరవకూడదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలన్నారు.

పెదకూరపాడు మండలంలో

పెదకూరపాడు, మే 18 : మండలంలో 144వ సెక్షన్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రజలు సహకరించాలని ఎస్‌ఐ వీ వెంకటరావు శనివారం తెలిపారు.

గ్రామాల్లో కొనసాగుతున్న పోలీసు పికెటింగ్

మాచవరం, మే 18: మండలంలోని పలు గ్రామాల్లో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. ఇటీవల ఎన్నికల అనంతరం కొత్తగణేషునిపాడు గ్రామంలో ఇరువర్గాలు ఒకరి గృహాలపై ఒకరు రాళ్లు రువ్వుకొని ధ్వంసం చేసుకున్న విషయం విదితమే. రెండు రోజులపాటు గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అప్పటి నుంచి గ్రామంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రధాన కూడళ్ల లో పోలీసు పికెటింగ్ కొనసాగుతోంది. పిన్నెల్లి గ్రామంలో నెల రోజుల నుంచి పోలీసు పికెట్ కొనసాగుతూనే ఉంది. రెండు రోజుల క్రితం పెట్రోలు బాంబులు, రాళ్లు, మారణాయుధాలు ఇరువర్గాల గృహాల్లో దొరకడంతో అప్పటి నుంచి కూడా పోలీసులు సంఖ్య పెంచి పికెట్లు కొనసాగిస్తున్నారు. శనివారం ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లకు సంబంధించి సిట్ అధికారులు విచారణకు వస్తున్నారనే సమాచారంతో స్థానిక పోలీసులు కొత్తగణేషునిపాడు గ్రామంలో ఉదయం నుంచి వారి కోసం ఎదురుచూశా రు. సిట్ అధికారుల బృందం ఆదివారం వస్తున్నారనే సమాచారం తెలియడంతో స్థానిక పోలీసు అధికారులు వెళ్లిపోయారు.



కొత్త గణేషునిపాడులో పహారా కాస్తున్న పోలీసులు



పిన్నెల్లిలోని ఉర్దూ పాఠశాలలో పోలీసులు

ఇసుక రీచ్‌లో మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పరిశీలన

● గ్రౌండ్ రిపోర్టు సమర్పించాలని కలెక్టర్లకు కోర్టు ఆదేశాలు
● అక్రమ తవ్వకాలు జరిపిన ప్రాంతంలో కొలతలు

అమరావతి, మే 18: ఎలాంటి అనుమతులు లేకుండా యంత్రాల ద్వారా ఇసుక ను క్వారీయింగ్ చేసి కోర్టులను తప్పుదోవ పట్టించిన అధికారుల తీరుపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసి గ్రౌండ్ రిపోర్టును కోర్టుకు సమర్పించాలని కలెక్టర్లను ఆదేశించిన మేరకు జిల్లా స్థాయి అధికారులు శనివారం మధ్యాహ్నం అమరావతి మండలపరిధిలోని మల్లాది గ్రామంలోని ఇసుక రీచ్‌ను సందర్శించారు. రెండు రోజుల వరకు యంత్రాల ద్వారా రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను అధికార పార్టీ నాయకులు తరలించి సొమ్ము చేసుకున్నారు. పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాల మేరకు అక్రమంగా తరలించిన ఇసుక క్వాంటిటీని లెక్కిం చేందుకు, తవ్వకాలు జరిపిన ప్రదేశం బౌండరీ నిర్ధారించేందుకు ఇరిగేషన్, మైనింగ్, సెబ్, పొల్యూషన్, రెవెన్యూ, పోలీసు అధికారులు మూకుమ్మడిగా మల్లాది రీచ్‌లో అక్రమ క్వారీయింగ్ జరిగిన ప్రదేశాన్ని గుర్తించి బౌండరీలు నిర్ధారించి, ఇసుక తీసిన గుంతలను కొలిచి లెక్కించారు. దీనికి సంబంధించిన గ్రౌండ్ రిపోర్టును ఇన్‌చార్జి కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఆదివారం వైకుంఠపురం రీచ్‌లో అక్రమ తవ్వకాలు జరిపిన ప్రదేశాలను సందర్శించి గ్రౌండ్ రిపోర్టు తయారు చేయనున్నారు. కార్యక్రమంలో ఏడీ మైన్స్ అధికారి నాగిని, ఎంపీడీవో రాణి, తహసీల్దార్ వెంకట రమణారావు, ఎస్‌ఐ నరసింహ, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మల్లాది ఇసుక రీచ్‌లో అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

భక్తి శ్రద్ధలతో కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు

కారంపూడి, మే 18: శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి జయంతిని స్థానిక అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమాలను ఆలయ ప్రధాన అర్చకుడు సాగి మణికంఠశాస్త్రి నిర్వహించారు. అమ్మవారికి వెండి చీర ధరింపజేసి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మహిళా మండలి అధ్యక్షురాలు ఇమ్మడిశెట్టి కోమల ఆధ్వర్యాన కుంకుమ పూజలు జరిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు చీతిరాల వెంకట కోటేశ్వరరావు, ఆలయ నిర్మాణ కమిటి అధ్యక్షుడు కరాలపాటి సుబ్బారావు, వెచ్చా వర లక్ష్మణరావు, యోగేశ్వరరావు, వాసు తదితరులు పాల్గొన్నారు.

రెంటచింతల, మే 18 : రెంటచింతలలోని వాసవీ కన్యకపరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో జగజ్జనని వాసవీ మాత జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ కట్టమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. ఆలయ పూజారులు శర్మ, జగన్‌ల నేతృత్వంలో వేకువజాము నుంచే సుప్రభాత సేవ, లలిత సహస్ర పారాయణం, అభిషేకాలు, కుంకుమార్చనతో పాటు అన్నదానం చేశారు. రామకృష్ణ నేతృత్వంలో మహిళల కోలాటం ప్రత్యేక ఆకర్షణగా ఉంది. 5 కేజీల అమ్మవారి లడ్డూను కొత్త రాధాకృష్ణమూర్తి రూ.9700లకు పాడుకున్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.

నకరికల్లు, మే 18 : నకరికల్లులో ఉన్న వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శనివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆర్య వైశ్యుల ఆరాధ్య దేవత వాసవీ అమ్మవారిని దర్శించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను అర్చక స్వామి తుంగతుర్తి విశ్వనాథ శాస్త్రి పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

సత్తెనపల్లి, మే 18 : పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి మాత దేవస్థానంలో అమ్మవారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



కారంపూడిలో వెండి చీర అలంకరణతో కన్యకా పరమేశ్వరి అమ్మవారు



రెంటచింతలలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

అచ్చంపేట, మే 18: వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించినట్టు దేవస్థాన కమిటీ సభ్యులు సూరె వెంకట సుబ్బారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా మంగళతోరణం, సుప్రభాతం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు జరిగాయి. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు సూరె వీరవెంకట మణికంఠ, సూరె రామలింగస్వామి, అనుమోలు శేషగిరిరావు, కోశాధికారి సూరె వెంకట సుబ్బారావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

క్రోసూరు, మే 18 : క్రోసూరులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలు భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం వారిచే ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. తెల్లవారుజాము నుంచే మహిళలు పెద్ద సంఖ్యలో దేవాలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లలిత సహస్ర నామార్చన, కుంకుమార్చన, అమ్మవారి మూల విరాట్‌కు ప్రత్యేక అలంకారం, మంత్ర పుష్ప వినియోగం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో కుంకుమార్చనలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చుండూరి మల్లికార్జునరావు, తొమ్మంద్రు నాగేశ్వరరావు, కట్టమూరి అప్పారావు, కజ్జం రమేష్, పసుమర్తి నాగేశ్వరరావు, చుండూరు రామకోటేశ్వరరావు, మారం సీతా రామయ్య, పూర్ణచంద్రరరావు తదితరులు పర్యవేక్షించారు.



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

ఏనుగుపాలెంలో మహిళ అనుమానాస్పద మృతి

వినుకొండ టౌన్, మే 18: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. గేదెలు కాసేందుకు పొలం వెళ్ళిన దేవి (27) శుక్రవారం సాయంత్రానికి ఇంటికి రాలేదు. గేదెలు మాత్రమే ఇంటికి చేరాయి. గమనించిన భర్త చింతల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి పొలాల్లో గాలించినా ఫలితం కనిపించలేదు. శనివారం ఉదయం పిట్టబండ వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని చెక్ డ్యామ్ నీటిగుంతలో దేవి మృతదేహం వెలుగుచూసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దేవి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి చెల్లెలు కృష్ణవేణి తెలిపిన వివరాలను పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని ఏటిముగ్గ గ్రామానికి చెందిన కనకరావు, భార్య మంగ పెద్దకుమార్తె దేవిని ఏనుగుపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాసరావుతో 10 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. నెల రోజుల నుంచి తమ అక్కకు, తమ కుటుంబసభ్యులకు ఫోన్ సంభాషణ లేదని, ఇంతలో దేవి మృతి చెందిందని తమకు కబురు వచ్చిందన్నారు. తమ అక్క మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు చెల్లి కృష్ణవేణి తెలిపారు. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాంబశివరావు తెలిపారు.

కౌంటింగ్‌కు సచివాయ సిబ్బంది దూరం

● ఎన్నికల రిజర్నింగ్ అధికారి శ్యాం ప్రసాద్

రెంటచింతల,మే 18 : జూన్ 4న ఎన్నికల కౌంటింగ్‌కు సచివాలయ సిబ్బంది సేవలను వినియోగించుకోవడం లేదని మాచర్ల ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. నరసరావుపేటకు సమీపంలోని కాకాని వద్ద గల జేఎన్‌టీయూ కళాశాలలో మాచర్ల నియోజకవర్గ కౌంటింగ్ ఉంటుందన్నారు. కౌంటింగ్ విధులకు ప్రభుత్వ ఉద్యోగులు తగినంత మంది ఉన్నారన్నారు. అందుకే అదనంగా సచివాలయ సిబ్బంది సేవలు అవసరం లేదని ఒక ప్రకటనలో స్పష్టం చేశారు.

కర్ఫ్యూ వాతావరణంలోనూ మద్యం అమ్మకాలు

కారంపూడి, మే 18: ఐదు రోజులుగా కారంపూడి 144 సెక్షన్ పేరిట కర్ఫ్యూ వాతావరణం నెలకొల్పారు. వ్యాపార సంస్థలు తెరుచుకోలేదు. ఉదయం ఒక గంట మాత్రం పాలు, కూరగాయలు కొనుగోలుకు అనుమతిస్తున్నారు. మిగతావి తెరవనీయడం లేదు. అయితే ప్రభుత్వ వైన్ షాపులు మాత్రం తెరుచుకుంటున్నాయి. పట్టణంలోని ఉన్న రెండు వైన్ షాపులను కూడా తెరిచి మద్యం విక్రయిస్తున్నారు. వైన్ షాపులకు 144 సెక్షన్ వర్తించదా అని ప్రజలు విమర్శిస్తున్నారు.



వైన్ షాపులో నిర్వహిస్తున్న మద్యం విక్రయాలు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

● చికిత్స పొందుతూ ఒకరి మృతి

ముప్పాళ్ళ మే 18: మండలంలోని గోళ్ళపాడులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు గాయాలవగా చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు నకరికల్లు మండలం చేజర్లకు చెందిన షేక్ షరీఫ్(24) తాపీ పని చేసుకుంటూ నరసరావుపేటలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. పని నిమిత్తం సత్తెనపల్లి వచ్చి ద్విచక్ర వాహనంపై నరసరావుపేట వెళుతుండగా, లంకెళకూరపాడుకు చెందిన హనిమిరెడ్డి ద్విచక్ర వాహనాలపై నరసరావుపేట నుంచి తన గ్రామానికి వెళుతున్నాడు. గోళ్ళపాడులో ఇద్దరి వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరి తలలకు తీవ్రగాయాలయ్యాయి. వారిని నరసరావుపేట తరలించారు. షేక్ షరీఫ్ పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రభుత్వ వైద్యశాల నుంచి ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ షరీఫ్ మృతి చెందాడు. హనిమిరెడ్డికి ప్రాణాపాయమేమి లేదని పోలీసులు తెలిపారు.

ఎన్నికల ఘర్షణల్లో పలువురిపై కేసులు

అచ్చంపేట, మే 18 : మండలంలోని చింతపల్లి, కొత్తపల్లి, వేల్పూరు గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలో ఐదు కేసులు నమోదైనట్లు సీఐ ఎస్‌కే కరీముల్లా షావలి శనివారం తెలిపారు. కొత్తపల్లిలో వైసీపీకి చెందిన చిలకా యాకోబు ఫిర్యాదు మేరకు రంగిశెట్టి నరసింహారావు, కూకట్లపల్లి అయ్యపరాజు, మరో తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఇదే గ్రామంలో టీడీపీకి చెందిన రంగిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు తేళ్ళూరి వెంకట రామిరెడ్డి, మార్కపూడి దేవదానం, మరో ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. వేల్పూరులో వైసీపీకి చెందిన సందెపోగు మాణిక్యం ఫిర్యాదు మేరకు పొన్నెకంటి వంశీ, పొన్నెకంటి శివ నాగమల్లేశ్వరరావు, మరో ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా చింతపల్లిలో వైసీపీకి చెందిన చిలకా పెద ఇస్సాక్ ఫిర్యాదు మేరకు బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, మరో నలుగురు టీడీపీ కార్యకర్తలపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పేరుబోయిన పుల్లారావు ఫిర్యాదు మేరకు చిలకా పెద ఇస్సాక్, కొంపెర్ల రోశయ్య, మరో ఐదుగురిపై కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

తొండపిలో ముగ్గురు అరెస్టు

ముప్పాళ్ళ మే 18: మండలంలోని తొండపిలో ఈనెల 13న జరిగిన ఎన్నికల్లో అల్లర్లకు పాల్లపడిన ముగ్గురిపై కేసు నమోదుచేసి శనివారం అరెస్టు చేశామని ఎస్‌ఐ హజరతయ్య తెలిపారు. వారిని కోర్టులో ప్రవేశ పెడతామని తెలిపారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడిన మరికొందరిపై కూడా వీడియోల్లో గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం.

భారీ వర్షం.. పొంగిపొర్లిన వాగులు

దాచేపల్లి, మే 18: భారీ వర్షాలతో దాచేపల్లి మండలంలో నీరు లేక ఎండిపోయి ఉన్న నాగులేరు, ఇతర చిన్న వాగులు పొంగిపొర్లుతున్నాయి. ఇప్పటి వరకు నీళ్ల లేక ఇబ్బంది పడిన గ్రామస్థులు బోర్లు నిండి నీరు రావడంతో ఉత్సాహంగా ఉన్నారు. వాతావరణం చల్లబడడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా లోలెవల్ చప్టాల నుంచి వాగులు ప్రవహించడంతో దాచేపల్లి, కేశానుపల్లి మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నడికుడి రైల్వేస్టేషన్, నడికుడి గ్రామాల మధ్య ఉన్న నల్లవాగు లోలెవల్ బ్రిడ్జిపై నుంచి వర్షపు నీరు ప్రవహిస్తోంది.



దాచేపల్లిలో పొంగిపొర్లుతున్న నాగులేరు

కారంపూడిలో..

కారంపూడి, మే 18: కారంపూడిలో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి రెండు గంటలపాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. ఈ వర్షానికి ఈదురు గాలులు తోడయ్యాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడడంతో పట్టణ ప్రజలు సేద తీరారు. ఇప్పటి వరకు ఎండల తీవ్రతతో ఇబ్బంది పడిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వర్షంతో రైతన్నల హర్షం

దుర్గి, మే 18 : అకాలవర్షం పడడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ తొలకరి వర్షాలు ఖరీఫ్ పంటకు నాణ్యమైనవన్నారు. రైతన్నలు పంటసాగుకు సమాయత్తమయ్యారు. పొలాలను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు.

కారంపూడిలో పిడుగుపాటు

కారంపూడి, మే 18: కారంపూడిలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం పడింది. పట్టణంలోని వినుకొండ రహదారిలో ఉన్న షాదీఖానా వెనుకవైపున ఉన్న ఇంటి గోడపై పిడుగుపడింది. దీంతో గోడ బాగా దెబ్బతింది. గృహంలో ఉన్న వారంతా ఆ శబ్దానికి బయటకు పరుగులు తీశారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

దాచేపల్లి, మే 18: దాచేపల్లిలోని మాచర్ల టర్నింగ్ వద్ద దుర్గాదేవి గుడి వెనుక భాగంలో పిడుగు పడినట్లుగా స్థానికులు తెలిపారు. పిడుగుదెబ్బకు స్థానికుల టీవీలు, ఇతరత్రా గృహోపకరణాలు దెబ్బతిన్నట్లు తెలిపారు.

పాత ఉప్పలపాడులో కార్డెన్ సెర్చ్

నూజెండ్ల, మే 18: మండలంలోని ఉప్పలపాడులో వినుకొండ రూరల్ సీఐ సుధాకర్ బాబు, ఐనవోలు ఎస్‌ఐ ఎం లక్ష్మీనారాయణ రెడ్డిలు కార్డెన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుంటూరు సౌత్ కోస్టల్‌జోన్ ఐజీ ఉత్తర్వులు మేరకు గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామన్నారు. గ్రామంలోని ఇళ్ళను, గడ్డివాములను క్షుణ్ణంగా పరిశీలించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పాత ఉప్పలపాడులో కార్డెన్ సెర్చ్

నూజెండ్ల, మే 18: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వినుకొండ రూరల్ సీఐ సుధాకర్ బాబు, ఐనవోలు ఎస్ఐ ఎం లక్ష్మీనారాయణ రెడ్డిలు కార్డెన్ సెర్చ్ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గుంటూరు సౌత్ కోస్టల్ జోన్ ఐజీ ఉత్తర్వులు మేరకు గ్రామాల్లో శాంతిభద్రతలను కాపాడేందుకు, అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడే వారిని గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టామ న్నారు. గ్రామంలోని ఇళ్లను, కొష్టాలు, గడ్డివాములను క్షుణ్ణంగా పోలీసులు తనిఖీ చేశారు.

చిలకలూరిపేటలో పకడ్బందీగా 144 సెక్షన్

చిలకలూరిపేట, మే 18: చిలకలూరిపేట పట్టణంలో 144వ సెక్షన్‌ను అర్బన్ పోలీసులు పకడ్బందీగా అమలు చేస్తున్నారు. శనివారం పట్టణంలోని టీ దుకాణాల యజమానులను అర్బన్ స్టేషన్‌కు సీఐ పీ రమేష్ పిలిపించారు. టీ దుకాణాల వద్ద నలుగురు కంటే ఎక్కువ మంది గుమికూడరాదని తెలిపారు. దీంతో టీ దుకాణాల వారు పట్టణంలోని టీ దుకాణాలన్నింటినీ మూసివేశారు. సాయంత్రం సీఐ రమేష్‌తోపాటు అర్బన్ ఎస్ఐ పుల్లారావు తదితరులు ప్రధాన సెంటర్లలో ఉన్న దుకాణదారుల వద్దకు వెళ్లి ఆయా దుకాణాల ఎదుట నలుగురు కంటే ఎక్కువమంది గుమికూడకుండా చూడాలని కోరారు. కొన్ని దుకాణాల ఎదుట అధికసంఖ్యలో గుమికూడిన వారిని పోలీసులు చెద రగొట్టారు. 144వ సెక్షన్ అమలు విషయంలో కఠినంగా వ్యవహరి స్తా మని పోలీసులు తెలిపారు. ప్రధానంగా టీ దుకాణాల వద్ద అధిక సం ఖ్యలో జనం గుమికూడి ఉండటంతో వాటిపై ప్రత్యేక దృష్టి సారించారు.

నూజెండ్లలోనూ అమలు...

నూజెండ్ల, మే 17: ఎన్నికల అనంతరం ఘర్షణలు చోటుచేసుకున్న మండల కేంద్రం నూజెండ్లలో ఐదవ రోజు శనివారం 144 సెక్షన్‌ను అమలు చేసి పోలీసు పికెటింగ్‌ను కొనసాగిస్తున్నారు. గ్రామంలోని దుకాణాలను మూయించి గ్రామస్తులు ఎక్కువగా ఒక చోట చేరకుండా ఐనవోలు పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

20న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రారంభం

నరసరావుపేట రూరల్, మే 18: మండలంలోని కేసానుపల్లి వద్ద నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూలు ఈ నెల 20వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవం జరుపుకుంటున్నట్లు ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్‌స్కూల్ కార్యదర్శి డాక్టర్ నాగోతు ప్రకాశరావు ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ, గౌరవ అతిథిగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు హాజరవుతారని తెలిపారు. 5 ఎకరాల విస్తీర్ణంలో సీబీఎస్ఈ సిలబస్ నర్సరీ నుండి 8వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియంలో విద్యాబోధన ఉంటుందని వివరించారు. విద్యార్థులలో సృజనాత్మకతను పెంపొందించేందుకు క్రీడలు, యోగా తదితర కార్యకలాపాలలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. సోమవారం ఉదయం 9 గంటలకు 2 నుంచి 8వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహనా సదస్సు, స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్కాలర్‌షిప్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన వారికి జస్టిస్ నూతలపాటి వెంకటరమణ చేతులమీదుగా బహుమతులు అందజేస్తారని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నికల కోడ్ నేపథ్యంలో

వెంటనే ముగిసిన సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, ఎంపీడీవో టీ వీరభద్రాచారి

నూజెండ్ల, మే 18: ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణం చేత శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం పది నిమిషాల్లోనే ముగిం చారు. చట్ట ప్రకారం గడువులోగా నిర్వహిం చాల్సిన సర్వసభ్య సమా వేశాన్ని అధికారులు, గౌరవ సభ్యుల సంతకాలు తీసుకొని ఎటువంటి అభివృద్ధి నివేదికలు, ప్రశ్నోత్తరాలు లేకుండా ముగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో టీ వీరభద్రాచారి, ఎంపీపీ మేడం జయరామిరెడ్డి, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఒక బావి... 20 మోటార్లు



తురుమెళ్ళలో బావి వద్ద ఏర్పాటుచేసిన మోటార్లు

రొంపిచర్ల, మే 18: మండలంలోని తురుమెళ్ళ గ్రామంలో ఒక బావి వద్ద నీటికోసం 20 మోటార్లను బిగించారు. చుట్టుపక్కల గృహాల అవసరాల కోసం బావి వద్ద వీటిని ఏర్పాటుచేశారు. వేసవి కాలం కావటంతో నీటి వినియోగం అధికంగా ఉండటంతో మోటార్లను బిగించారు.

ఎన్నికల ఘర్షణల్లో పలువురిపై కేసులు

అచ్చంపేట, మే 18 : మండలంలోని చింతపల్లి, కొత్తపల్లి, వేల్పూరు గ్రామాల్లో ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలో ఐదు కేసులు నమోదైనట్టు సీఐ ఎస్కే కరీముల్లా షావలి శనివారం తెలిపారు. కొత్తపల్లిలో వైసీపీకి చెందిన చిలకా యాకోబు ఫిర్యాదు మేరకు రంగిశెట్టి నరసింహారావు, కూకట్లపల్లి అయ్యపరాజు, మరో తొమ్మిది మంది టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఇదే గ్రామంలో టీడీపీకి చెందిన రంగిశెట్టి నవీన్ ఫిర్యాదు మేరకు తేళ్ళూరి వెంకట రామిరెడ్డి, మార్కపూడి దేవదానం, మరో ఐదుగురు వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదయ్యాయి. వేల్పూరులో వైసీపీకి చెందిన సందెపోగు మాణిక్యం ఫిర్యాదు మేరకు పొన్నెకంటి వంశీ, పొన్నెకంటి శివ నాగమల్లేశ్వరరావు, మరో ఆరుగురు టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా చింతపల్లిలో వైసీపీకి చెందిన చిలకా పెద ఇస్సాక్ ఫిర్యాదు మేరకు బత్తుల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేశ్వర్లు, మరో నలుగురు టీడీపీ కార్యకర్తలపై అట్రాసిటీ కేసు నమోదైంది. ఇదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పేరుబోయిన పుల్లారావు ఫిర్యాదు మేరకు చిలకా పెద ఇస్సాక్, కొంపెర్ల రోశయ్య, మరో ఐదుగురిపై కేసులు నమోదైనట్టు సీఐ తెలిపారు.

నరసరావుపేట పట్టణాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు



నరసరావుపేటలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐలు అశోక్, సతీష్



వరవకట్టలో తనిఖీలు చేస్తున్న సీఐ కృష్ణారెడ్డి

నరసరావుపేట లీగల్, మే 18: ఎన్నికల నేపథ్యంలో చోటు చేసుకున్న నేరాలకు సంబంధించి నిందితులను అరెస్టు చేయటానికి డీఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఆదేశాల మేరకు శనివారం మొదటి, రెండవ పట్టణ పోలీసులు వివిధ ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. మొదటి పట్టణ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది వరవకట్ట, మొదటి పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని లాడ్జీలు, వసతిగృహాలు, హోటల్స్‌ను జల్లెడపట్టారు. అనుమానితులు ఎవ్వరూ దొరకలేదని సీఐ తెలిపారు. కాగా రెండవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో సీఐ ఏ భాస్కర్ ఆధ్వర్యంలో పెదచెరువులోని రాజీవ్ గృహకల్పలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐలు అశోక్, సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో భారీ వర్షం

● పొంగి పొర్లుతున్న వాగులు, కుంటలు



గుమ్మనంపాడు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్ళ చెరువు వాగు



పిడుగుపాటుకు దెబ్బతిన్న గృహం

బొల్లాపల్లి, మే 18: మండలంలోని గుమ్మనంపాడు, అయ్యన్నపాలెం, గరికపాడు, పమిడిపాడు, మేళ్ళవాగు, రేమిడిచర్ల గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి గ్రామాల్లోని చెరువులు, కుంటలు, వాగులు పొంగి ప్రవహించాయి. గుమ్మనంపాడు గ్రామం వద్ద గుమ్మనంపాడు రాళ్ళవాగు చెరువు ఉధృతంగా ప్రవహించటంతో గ్రామానికి చెందిన జీ పెదవీరయ్య జీవాలు కొట్టుకు పోయాయి. గ్రామంలో పిడుగుపాటుకు రెండు గృహాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అదే విధంగా అయ్యన్నపాలెం గ్రామంలో కొత్త చెరువు, రామిరెడ్డిచెరువు, కొత్తవాగు పొంగి ప్రవహించటంతో చెంచులు నివసించే గృహాల్లోకి భారీగా నీరు రావటంతో కట్టుబట్టలతో బయటకు వచ్చేశారు. కారంపూడి నుంచి గరికపాడుకు వెళ్తున్న జీపు పమిడిపాడు మేళ్ళవాగు, పులివాగు ఉధృతంగా ప్రవహించటంతో నీటి ప్రవాహానికి జీపు కొంత దూరం కొట్టుకుపోయింది. అందులో నలుగురు ప్రయాణీకులు ఉన్నారు. సమీపంలోని పమిడిపాడు గ్రామస్తులు గ్రామానికి చెందిన సంగు రమణారెడ్డి జేసీబీ సాయంతో ఇరుక్కుపోయిన జీపును, నలుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించటంతో పాటు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. వర్షాలు లేక తాగేందుకు నీరు లేక, ఎండ వేడిమి తాళ లేక ఇబ్బందులు పడుతున్న మండల ప్రజలకు శనివారం కురిసిన భారీ వర్షం ఊరటనిచ్చింది. కాగా వాగు పొంగి పొర్లటంతో రవాణా ఎక్కడికక్కడ స్తంభించిపోయింది.

ఐదు సెల్‌ఫోన్‌ల రికవరీ

● సంబంధిత వ్యక్తులకు అందజేత



పోగొట్టుకున్న వ్యక్తులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న అర్బన్ సీఐ పీ రమేష్

చిలకలూరిపేట, మే 18: అర్బన్ పోలీసు స్టేషన్ పరిధిలో పలువురు పోగొట్టుకున్న సెల్ ఫోన్‌లను అర్బన్ సీఐ పీ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు స్వాధీనం చేసుకున్నాయి. శనివారం సెల్‌ఫోన్‌లు పోగొట్టుకున్న వారిని స్టేషన్‌కు పిలిపించి వాటిని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్లపైనే మురుగు ప్రవాహం



యడ్లపాడు మేదర బజారులోని మహేంద్ర సంఘ భవనం సమీపంలో సిమెంటు రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు, వర్షపునీరు

యడ్లపాడు, మే 18 : అస్తవ్యస్త డ్రెయినేజి వ్యవస్థతో రోడ్లు మురుగు నీటి కాలువలుగా మారుతున్నాయి. కొద్దిపాటి వర్షం కురిసినా వ ర్షపునీటితో కలసి మురుగు నీరు రోడ్లపైకి చేరు తోంది. దీనికితోడు కాలువల్లో చెత్త చెదారాలు పేరుకుపోవడంతో కొద్దిపాటి వర్షానికే కాలువ లు పొంగి మురుగునీరు రోడ్లపైకి చేరి రాకపోక లకు ఇబ్బందికరంగా మారుతోంది. వీధులు బురదమయంగా మారి ఇంట్లో నుంచి కాలు బయటకు పెట్టాలంటే వీలు కాని పరిస్థితి నెల కొంది. యడ్లపాడులో శనివారం మధ్యాహ్నం కొద్దిసేపు కురిసిన వర్షానికి మేదర వీధిలోని మురుగుకాలువలు పొంగిపొర్లాయి. కాలువల్లోని చెత్త చెదారాలతోపాటు మురుగునీరు రోడ్డుపై ప్రవహించింది. వర్షం తగ్గినా గంటకుపైగా మురుగునీరు వర్షపు నీటితో కలసి సిమెంటు రోడ్డుపై ప్రవహించింది. ఈ నెల 13న కురిసిన భారీ వర్షానికి తహ సీల్దార్ కార్యాలయానికి వెళ్ళు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న మురుగు కాలువలు పొంగిపొర్లాయి. దీనితో భారీగా మురుగునీరు, చెత్త చెదారాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్డుపైకి చేరాయి. తహసీల్దార్ కా ర్యాలయం, ఎర్ర చెరువు కాలనీలోని ఎంఈవో కార్యాలయ పరిసరా లలో ఈ సమస్య అధికంగా ఉంది. పూర్తిగా వర్షాకాలం రాకముందే అస్తవ్యస్తంగా ఉన్న మురుగు కాలువలకు మరమ్మతులు చేయించడం, పేరుకుపోయిన సిల్టును తొలగించాలని ప్రజలు అధికా రులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఏబీఎం ఆస్తుల విక్రయాలను ఎమ్మెల్యే అడ్డుకుంటున్నారు

● జాన్ సుందరరావు

వినుకొండ, మే 18: ఏబీఎం ఆస్తులపై హైకోర్టు నిషేధిత జాబితా నుంచి తొలగించినప్పటికీ క్రయ, విక్రయాల్లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు గడిచిన ఐదేళ్లుగా అడ్డుపడుతూ, స్థానికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాడని జామవా సమాఖ్య అధ్యక్షుడు చిలకల జాన్ సుందరరావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రహ్మనాయుడు నర్సరావుపేటలో హార్డు మహిళా కళాశాల ఎదురుగా (పీఏబీసీ) చెందిన సర్వేనెంబర్ 1544లో 30 సెంట్లు ఆస్తిని రూ.29.79 లక్షలకు అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి కాజేశారన్నారు. అదేవిదంగా బాప్టిష్టు చర్చికి సంబంధించిన రూ.30లక్షల విలువచేసే ఫిక్సడ్ డిపాజిట్ బాండ్స్ మీవద్దకు ఎలా చేరాయని, ఎందుకు ఉంచుకున్నారో చెప్పాలని నిలదీశారు.



వంకాయలపాడు చెరువులో అనధికారికంగా వేసిన లేఅవుట్‌లోని హద్దు రాళ్ళను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

అనధికార ప్లాట్లలో హద్దు రాళ్ళ తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వంకాయలపాడు(యడ్లపాడు), మే 18: చెరువు భూముల్లో అనధికారికంగా వేసిన ప్లాట్లను పంచాయతీ అధికారులు తొలగించారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు చెరువు భూముల్లో వైసీపీ నాయకుడు అనధికారికంగా ప్లాట్లు వేసి విక్రయించి సొమ్ము చేసుకున్న విషయమై 'చెరువు భూముల్లో అనధికారిక ప్లాట్లు' శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనితో గ్రామపంచాయతీ అధికారులు చెరువు భూముల్లో వేసిన ప్లాట్ల హద్దురాళ్ళను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. పంచాయతీ సిబ్బందితోపాటు, జేసీబీ సహాయంతో ప్లాట్లకు వేసిన హద్దురాళ్ళను తొలగించారు. తిరిగి ప్లాట్లకు హద్దురాళ్ళను ఏర్పాటుచేయకుండా నిఘా ఉంచడంతోపాటు పర్యవేక్షిస్తామని, తొలగించిన రాళ్లను పంచాయతీ కార్యాలయానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు తెలిపారు. అలాగే ఇప్పటికే ప్లాట్లలో నిర్మాణాలు ప్రారంభించిన వారికి నోటీసులు జారీచేసి ఖాళీ చేయించనున్నట్లు వెల్లడించారు. చెరువు భూముల్లో ప్లాట్లు వేయడం, అమ్మడం, కొనడం చేయకూడదన్నారు.

గుర్తింపు కార్డుల జారీపై

అభ్యర్థులకు ఆర్వో సూచనలు

చిలకలూరిపేట, మే 18 : చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు నరసరావుపేటలో భద్రపరిచిన ఈవీఎంలను సీసీ టీవీ ద్వారా పర్యవేక్షించటానికి గుర్తింపు కార్డులు జారీ చేయటం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి బీ నారదముని శనివారం తెలిపారు. అభ్యర్థుల వివరాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించిన వెంటనే 24 గంటల్లోగా వారికి గుర్తింపుకార్డులు మంజూరు చేయటానికి జిల్లా ఎన్నికల అధికారికి సిఫార్సు చేయటం జరుగుతుందని పేర్కొన్నారు.

బొల్లాపల్లి మండలంలో 89.93శాతం పోలింగ్

● పోలింగ్ అనంతరం చెదురుమదురు సంఘటనలు



వెల్లటూరులో బారులు తీరిన మహిళా ఓటర్లు (ఫైల్‌ఫోటో)

బొల్లాపల్లి, మే 18 : ఈ నెల 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బొల్లాపల్లి మండలంలో 98.93 శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో మొత్తం 54,095 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళా ఓటర్లు 28,210 మంది ఉన్నారు. అలాగే పురుష ఓటర్లు 25,800 మంది ఉన్నారు. ఇతరులు ఐదుగురు ఉన్నారు. మొత్తం మండలంలో 61 పోలింగ్ కేంద్రాల్లో 48,200 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో బొల్లాపల్లి మండలంలో అత్యధికంగా 89.93 శాతం పోలింగ్ నమోదైంది. చెదురు మదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గ్రామాల్లో మహిళా ఓటర్లు భారీగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రేమిడిచర్ల గ్రామంలో అర్ధరాత్రి 12 గంటల వరకు మహిళలు వేచివుండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో ఎక్కువ శాతం సుగాలీలు నివశించే గ్రామాలు ఉండటంతో ఈసారి వారు ఎటువైపు మొగ్గుతారోనని నియోజకవర్గం మొత్తం బొల్లాపల్లి మండలం వైపు చూస్తున్నది. పోలింగ్ అనంతరం వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఒకటి రెండు గ్రామాల్లో స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పేరూరుపాడు, బొల్లాపల్లి గ్రామంలో స్వల్ప ఘర్షణలు మినహా బొల్లాపల్లి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

ఏనుగుపాలెంలో

మహిళ అనుమానాస్పద మృతి



వినుకొండ ప్రభుత్వ వైద్యశాల్లో దేవి మృతదేహన్ని పరిశీలిస్తున్న సీఐ సాంబశివరావు



అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన దేవి (ఫైల్‌ఫోటో)

వినుకొండ టౌన్, మే 18: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఏనుగుపాలెం గ్రామంలో శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. గేదెలు కాసేందుకు పొలం వెళ్ళిన దేవి(27) శుక్రవారం సాయంత్రానికి ఇంటికి రాలేదు. గేదెలు మాత్రమే ఇంటికి చేరాయి. గమనించిన భర్త చింతల శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి పొలాల్లో గాలించినా ఫలితం కనిపించలేదు. శనివారం ఉదయం పిట్టబండ వెళ్లే ప్రధాన రహదారి సమీపంలోని చెక్‌డ్యామ్ నీటిగుంతలో దేవి మృతదేహం వెలుగుచూసింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని మృతదేహన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దేవి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతురాలి చెల్లెలు కృష్ణవేణి తెలిపిన వివరాలను పరిశీలిస్తే తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని ఏటిముగ్గు గ్రామానికి చెందిన కనకరావు, భార్య మంగ పెద్దకుమార్తె దేవిని ఏనుగుపాలెం గ్రామానికి చెందిన చింతల శ్రీనివాసరావుతో 10 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. నెల రోజుల నుంచి తమ అక్కకు, తమ కుటుంబసభ్యులకు ఫోన్ సంభాషణ లేదని, ఇంతలో దేవి మృతి చెందిందని తమకు కబురు వచ్చిందన్నారు. తమ అక్క మృతిపై పలు అనుమానాలు ఉన్నట్లు చెల్లి కృష్ణవేణి తెలిపారు. మృతురాలికి ఇరువురు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సాంబశివరావు తెలిపారు.

వైభవంగా కన్యకాపరమేశ్వరి జయంత్యుత్సవం

వినుకొండ, మే 18: పట్టణంలోని బోస్ బొమ్మసెంటర్ నందుగల కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి మహోత్స కార్యక్రమం శనివారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సదావర్తి సంఘం, ఆర్యవైశ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. జయంతి సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృతాలచే మూలవిరాట్ అమ్మవారికి అభిషేకాలు, మహిళలచే కుంకమ పూజ, హారతి, మంత్ర పుష్పం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

బొల్లాపల్లి మండలంలో...

బొల్లాపల్లి, మే 18: మండలంలోని వెల్లటూరు వాసవి కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో వెల్లటూరు వాసవి క్లబ్ వైభవ్ ఆధ్వర్యంలో శనివారం వాసవి మాత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైశాఖ శుద్ధదశమి నాడు ముందుగా అమ్మవారి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు అధికసంఖ్యలో అమ్మవారి పూజలకు హాజరయ్యారు. వాసవి క్లబ్ వైభవ్ అధ్యక్షులు పేరం వేణు, సుజాత ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. వాసవి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సంపూర్ణ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆర్యవైశ్యులు స్వామివారిని కోరుకున్నారు. కార్యక్రమంలో మండవ సత్యనారాయణ, గజ్వేలు సుబ్బయ్య, గురివిశెట్టి, ఆర్యవైశ్య సభ్యులు, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.



వినుకొండలో ప్రత్యేక అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు



బొల్లాపల్లి: వెల్లటూరులో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రొంపిచర్ల: ప్రత్యేక అలంకరణలో వాసవి అమ్మవారు

రొంపిచర్ల మండలంలో...

రొంపిచర్ల, మే 18: రొంపిచర్లలో ఉన్న శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి దేవస్థానంలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించారు. అమ్మవారికి జరిగిన లలితా సహస్రనామ కుంకుమార్చన పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది. సాయంత్రం భజన కార్యక్రమాలు జరిగాయి. పూజల్లో మద్ది రామబ్రహ్మానందరావు, గొడవర్తి వెంకటేశ్వర్లు, పసుమర్తి ఆదినారాయణ, కొప్పు కోటయ్య, గొడవర్తి వెంకటేశ్వర్లు, అర్వపల్లి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.